RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY  తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 181 ISSUE NO : 181 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, జనవరి 09, 2026 Friday, January, 9, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-

## ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య



- పేదల పొట్టకొట్టే యత్నం చేసిన మోడీ
- అధికారం ఉందని మోడీ ఇష్టారీతి నిర్ణయాలు
- ఉపాధితో పేదరిక నిర్మూలనకు అడుగులు

హైదరాబాద్,తెలంగాణ దిశ : పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్నే మారుస్తారా అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు.

గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం అని అన్నారు.

మెజారిటీ ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవా ల్సిన సమయమిదని అన్నారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. 2024 ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని భాజపా నేతలు ప్రచారం చేశారు. అన్ని సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చేసేవారు. తద్వారా పేదల హక్కులను కాలరాయాలని చూశారు.




## భారత్ సహా పలు దేశాలపై 500 శాతం సుంకాలు

**కొత్త బిల్లు తెస్తున్న ట్రంప్**

- రష్యాపై ఒత్తిడి పెంచే దిశగా ట్రంప్ కీలక నిర్ణయం
- రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం
- భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలే లక్ష్యం


వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు రష్యాపై మరింత ఒత్తిడి పెంచే దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై ద్వితీయ ఆంక్షలు విధించే ద్వైపాక్షిక బిల్లుకు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రష్యా నుంచి చమురు, యురేనియం కొనుగోలు చేసే దేశాలపై అమెరికా అధ్యక్షుడికి 500 శాతం వరకు సుంకాలు పెంచే అధికారాన్ని ఈ బిల్లు ఇస్తుంది. రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయిన తర్వాత ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ బిల్లు చైనా, భారత్, బ్రెజిల్ వంటి దేశాలపై ఒత్తిడి పెంచి, రష్యా చమురు కొనుగోళ్లు ఆపేలా చేస్తుందని, అది పుతిన్ చేస్తున్న యుద్ధానికి నిధులు లేకుండా చేస్తుందని గ్రాహం చెప్పారు.



## మోకిల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- చెట్టును ఢీకొన్న విద్యార్థుల కారు
- నలుగురు విద్యార్థుల దుర్మరణం

రంగారెడ్డి, జనవరి8 :రంగారెడ్డి జిల్లాలో గురువారం తెల్ల వారుజామున ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి బోల్తాపడటంతో నలుగురు విద్యార్థులు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగాఉంది. హైదరాబాద్ ఇక్ఫాయి యూనివర్సిటీ విద్యార్థులు శ్రీ నిఖిల్, సూర్యతేజ, సుమిత్, రోహిత్, నక్షత్ర కలిసి కోకాపేటలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఓ స్నేహితుడిని డ్రాప్ చేసి తిరిగి మోకిల నుండి హైదరాబాద్ నగరానికి వస్తుండగా గురువారం తెల్లవారు జామున రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలోని మిర్జాగూడ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది..



## కృష్ణా జలాలపై పదేపదే రాజకీయాలు

- పాలమూరు-రంగారెడ్డికి విభజన చట్టంలో ప్రతిపాదన ఏదీ
- పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తోడితే కెసిఆర్ ఏం చేశారు
- కెసిఆర్ 229 టిఎంసిలు చాలని సంతకం పెట్టలేదా?
- బేసిన్లు లేవు..భేషజాలు లేవన్నదే కెసిఆర్
- జగన్‌తో కలసి ఏం మాట్లాడారో బయటపెట్టాలి
- ఆనాడు మేం నిలదీస్తే విమర్శలు చేశారు
- మీడియా సమావేశంలో బండి ఘాటు వ్యాఖ్యలు

కరీంనగర్,,తెలంగాణ దిశ: కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసంచేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ కు 571టీఎంసీలు రావాల్సి ఉంటే.. 299 టీఎంసీలకే ఆయన ఎందుకు అంగీకారం తెలిపారని ప్రశ్నించారు. కరీంనగర్‌లోనిర్వహించిన మీడియాసమావేశంలో సం జయ్ మాట్లాడారు.పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిం చినప్పుడు ఎవరూ స్పందించ లేదన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయని మండిపడ్డారు.



## ‘బాగున్నరా అమ్మ’

**ఇంటికొచ్చిన మహిళా మంత్రులకు కేసీఆర్ ఆత్మీయ పలకరింపు..**

**ఎర్రవెల్లి,తెలంగాణ దిశ :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురువారం తన ఇంటికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులను ‘బాగున్నరా అమ్మ’ అంటూ ఆత్మీయంగా పలకరించారు. వారికి సాదర స్వాగతం పలికారు. కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ వారికి అతిథి మర్యాదలు చేశారు. సంప్రదాయం ప్రకారం పసుపు కుంకుమలు, చీర,తాంబూలాలతో ఆ ఆడబిడ్డలను సత్కరించారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి సీతక్క...



## నకిలీ ప్రభుత్వ ఉద్యోగాలతో మోసం

- ఆరు రాష్ట్రాల్లో ఏకకాలంలో ఇడి దాడులు
- ఇడి దాడులపై మండిపడ్డ బెంగాల్ సిఎం మమత

న్యూఢిల్లీ, జనవరి8 : ఒక వ్యవస్థీకృత ముఠా నిర్వహిస్తున్న నకిలీ ప్రభుత్వ ఉద్యోగాల కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం ఆరు రాష్ట్రాల్లో సోదాలు జరిపింది. బీహార్‌లోని ముజఫర్‌పూర్, మొతిహరి, పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా, కేరళలోని ఎర్నాకులం, పండలం, అదూర్ మరియు కోడూర్, తమిళనాడులోని చెన్నై, గుజరాత్‌లోని రాజ్‌కోట్, ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ప్రయాగ్‌రాజ్ మరియు లక్నోలోని 15 ప్రదేశాల్లో సోదాలు కొనసాగుతున్నట్లు ఇడి అధికారులు తెలిపారు. భారతీయ రైల్వేలో మొదట ఈ కుంభకోణాన్ని గుర్తించినప్పటికీ, అటవీ, పోస్ట్, ఐటి, హైకోర్టు, ప్రజా ప్రనుల శాఖ, బీహార్ ప్రభుత్వం, ఢిల్లీ అభివృద్ధి అథారిటీ, రాజస్థాన్ సెక్రటేరియట్, ఇతర ప్రభుత్వ సంస్థలు సహా 40కి పైగా విభాగాల్లో ఈ స్కామ్ జరిగినట్లు దర్యాప్తులో తేలిందని అన్నారు. ఈ ముఠా ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లను అనుకరిస్తూ నకిలీ ఇమెయిల్ ఖాతాలను వినియోగించి మోసపూరిత జాయినింగ్ లెటర్స్ పంపిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నమ్మించేందుకు రైల్వేలు, ఇతర సంస్థల్లో నియమించిన కొంతమంది బాధితులకు ఈముఠా రెండు నుండి మూడు నెలల వరకు జీతాల..



## కృత్రిమ మేధకు కేరాఫ్ అడ్రస్ గా.. హైదరాబాద్

**-రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**మంథని,తెలంగాణ దిశ:** కృత్రిమ మేధ సాంకేతికలో దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా హైదరాబాద్ పరుగులు పెడుతోందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. గురువారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హైటెక్ సిటీలో ఎయిడెన్ ఏఐ ఇంజనీరింగ్ కేంద్రం విస్తరణ పనులను ప్రారంభించిన సందర్భంగా ప్రసంగించారు. రెండేళ్లలో తమ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఎకో సిస్టం వల్ల ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇవ్వాళ తెలంగాణా వైపు చూస్తున్నాయని ఆయన తెలిపారు. ఎయిడెన్ ఏఐలో ప్రస్తుతం 500 మంది నిపుణులు పనిచేస్తుండగా వచ్చే రెండేళ్లలో మరో 500 మంది ప్రతిభావంతులకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. న్యూజెర్సీలోని ప్రిన్స్ టన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ కృత్రిమ మేధలో నూతన ఆవిష్కరణల ద్వారా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలిపారు. ఏఐని విస్తృత కార్యకలాపాలకు అభివృద్ధి చేసే సంస్థలను తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని శ్రీధర్ బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిఇఒ కిరణ్ వెంట్రప్రగడ, సిఒఒ శ్రీని కమిడి, కవితా మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

**సంతాపం ప్రకటించిన జైరామ్ రమేశ్**

పూనె, జనవరి8 :ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ (82) కన్నుమూశారు. ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పూనెలోని తన నివాసంలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు సిద్దార్థ్ గాడ్గిల్ గురువారం వెల్లడించారు. మాధవ్ గాడ్గిల్ పశ్చిమ కనుమల పర్యావరణ ప్రాముఖ్యతకు ఆయన విశేష కృషి చేశారు. ప్రపంచ జీవవైవిధ్య హాట్‌స్పాట్ అయిన పశ్చిమ కనుమలలో ఆయన చేసిన కృషికి గాను 2024లో ఐక్యరాజ్యసమితి అత్యున్నత పర్యావరణ గౌరవమైన వార్షిక ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డును బహూకరించింది. ఆయన పర్యావరణానికి సంబంధించి విలువైన సిఫార్సులను అందించారు. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో పర్యావరణానికి నష్టం చేకూర్చకుండా కఠినమైన ఆంక్షలను తన నివేదికలో సిఫార్సు చేశారు.



## 20న మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల కు కౌంట్‌డౌన్ మొదలైంది. గతేడాది డిసెంబర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ).. ఇప్పుడు పట్టణ పోరుపై దృష్టి సారించింది. జనవరి 20వ తేదీ నాటికి రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో.. దానికి సంబంధించి ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు చివరి తేదీ జనవరి 12 అని తెలిపారు.

# జై జవాన్ కాలనీకి యాభై శాతం షాపింగ్ కాంప్లెక్స్





## - హర్షం వ్యక్తం చేసిన కాలనీ సంక్షమ సంఘం సభ్యులు

**ఏఎస్ రావునగర్, జనవరి 08, (తెలంగాణ దిశ)** :గత 12 సంవత్సరాలుగా జఠిలంగా తయారైన షాపింగ్ కాంప్లెక్స్ సమస్యను జై జవాన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం యాభై శాతం షాపింగ్ కాంప్లెక్స్ ఎట్టకేలకు తిరిగి సాధించుకుందని కాలనీ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ లు పేర్కొన్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ విషయం వివాదాస్పదంగా మారి జిహెచ్ఎంసి స్వాధీనం చేసుకున్న అనంతరం తిరిగి కాలనీ అసోసియేషన్ కు 50 శాతం అర్హత కల్పిస్తూ జిహెచ్ఎంసి అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా కాలనీ సంక్షమ సంఘం గురువారం హర్షం వ్యక్తం చేసింది. కాలనీ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు, లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు కె. ఉపేందర్ రెడ్డి, పత్రి శ్రీనాథ్ లు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా కాలనీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్ ఆదాయం కాలనీ అసోసియేషన్ కు రాకుండా కొంత మంది వ్యక్తుల కారణంగా కోల్పోయి కాలనీ అభివృద్ధికి నిధులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసి అధికారుల సహకారంతో కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ సగ భాగం కాలనీకి కేటాయిస్తూ జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ లో ప్రత్యేకమైన గెజిట్ విడుదల అవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. జిహెచ్ఎంసి అధికారులు త్వరలో షాపింగ్ కాంప్లెక్స్ షాపులను అధికారికంగా వేలం వేస్తారని వారు తెలిపారు. కాలనీ కొత్త కమిటీ ఎన్నికైన కొద్ది రోజుల్లోనే ఇలాంటి ఘన విజయం సాధించి షాపింగ్ కాంప్లెక్స్ ను తిరిగి పొందగలిగామని అన్నారు. భవిష్యత్తులో కాలనీ అభివృద్ధికి కావలసిన కార్యక్రమాలకు కార్యాచరణ రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు ఎస్ పి రావు, ఎస్ ఎం సాహెబ్, ఎస్ ఏ సలీం, ఇబ్రహీం, యాదగిరి రెడ్డి, షణ్ముఖం, ఎలీషా, జిఎం. పాషా, షేక్ అల్లా బక్ష, వేణుగోపాల్, బాలరాజ్, సుందర్, వెంకట్ రెడ్డి, రత్తయ్య చౌదరి, మహబూబ్ షహీ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం బహిరంగ సభను జయప్రదం చేయాలి



**కుత్బుల్లాపూర్, జనవరి 08, (తెలంగాణ దిశ) :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ఈ నెల 18న ఖమ్మంలో నిర్వహించ తలపెట్టిన సిపిఐ కార్యకర్తల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ జగద్గిరిగుట్ట చౌరస్తా వద్ద సిపిఐ కుత్బుల్లాపూర్ మండల ఆధ్వర్యంలో గురువారం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఖమ్మంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొని జయప్రదం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కె. స్వామి సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వి. శ్రీనివాస్, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, సీనియర్ నాయకులు సీ. వెంకటేష్, దుర్గయ్య శాఖ కార్యదర్శులు సహదేవ రెడ్డి, వెంకటేష్, సిపిఐ నాయకులు ఇమామ్, సామిల్ నరసయ్య, నర్సింలు, జానకి రాములు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# వివిఎన్ఆర్ కళాశాల పార్కు స్థలాన్ని కాపాడి ప్రజా వినియోగంలోకి తేవాలి





**కుత్బుల్లాపూర్, జనవరి 08, (తెలంగాణ దిశ)** :బాచుపల్లి సర్వేనెంబర్ 142, 143, 144 లో మూడు ఎకరాల సీలింగ్ భూమిని కాపాడి ప్రజా అవసరాల కోసం వినియోగించాలని నిజాంపేటకు చెందిన ఆకుల సతీష్ గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఈ స్థలం ప్రగతి నగర్ గ్రామపంచాయతీ సమయంలో పార్కు స్థలంగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. అనంతరం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత కోట్లాది రూపాయలను వెచ్చించి పార్కుగా అభివృద్ధి చేశారని వివరించారు. 2023 సెప్టెంబర్ 15న సీలింగ్ భూమి కాదు పట్టా భూమి అంటూ కబ్జాదారులు రికార్డులను తప్పుగా చూపించారని తెలిపారు. అనంతరం స్పీడ్ విద్యుత్ సంస్థ ఈ స్థలాన్ని తన గుప్పెట్లోకి పెట్టుకొని రాత్రికి రాత్రే మొత్తం పార్కు స్థలాన్ని ఫెన్సింగ్ వేయడమే కాక షాపుల నిర్మాణాలకు అద్దెకు ఇచ్చారని ఆయన తన ఫిర్యాదులు పేర్కొన్నారు. తక్షణమే ఏడిఈ సర్వే చేయించి సీలింగ్ స్థలాన్ని ప్రభుత్వం పరిరక్షించి ప్రజా అవసరాల కోసం ఉపయోగించాలని ఆయన కోరారు. 1973 ల్యాండ్ సీలింగ్ యాక్ట్ లో భాగంగా సర్వే నెంబర్ 142, 143, 144 బాచుపల్లి వివిఎన్ఆర్ కాలేజ్ పక్కనే ఉన్న స్థలం పక్కా సీలింగ్ భూమి గా ఉందని ఇది సుమారు 16 వేల గజాలు రావడం జరిగిందని ఆయన వివరించారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ భర్త, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహకారంతో రాత్రికి రాత్రి ఈ స్థలాన్ని కబ్జా చేసి స్పీడ్ విద్యుత్ సంస్థకు అప్పగించారని తెలిపారు. గతంలో దీనిపై కలెక్టర్ కు కూడా ఫిర్యాదు కూడా చేశామని తెలిపారు. అదే విధంగా హైడ్రా అధికారులకు కూడా దీనిపై ఫిర్యాదు చేశామని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఈ స్థలంపై సర్వే చేయించి, ఆ స్థలాన్ని ప్రభుత్వం తిరిగి స్వాధీనంలోకి తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ సర్వే చేయించి సీలింగ్ భూమిగా గుర్తిస్తే తక్షణమే స్వాధీనం చేసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

# ఉద్యాన్ ఉత్సవ్ రెండవ ఎడిషన్ ఆరవ రోజు 10,500 మంది సందర్శన







**బొల్లారం, జనవరి 08, (తెలంగాణ దిశ)** :బొల్లారం రాష్ట్రపతి భవన్ లో నిర్వహిస్తున్న "ఉద్యాన్ ఉత్సమ కార్యక్రమం రెండవ ఎడిషన్ 6వ రోజు సుమారు 10, 500 మంది సందర్శించారు. ఇందులో భాగంగా ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఐటిఈసి), విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కింద 18 దేశాల నుండి 28 మంది విదేశీ ప్రతినిధులు రాష్ట్రపతి నిలయంలో జరిగిన అగ్రి హార్టీ ఎక్స్‌పోను సందర్శించారు. భారత దేశ సాంస్కృతిక వారసత్వాన్ని ఈ ప్రదర్శన ద్వారా తెలుసుకున్నామని విదేశీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ ప్రతినిధులు 8 నుండి 20 జనవరి 2026 వరకు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపిహెచ్ఎం)లో ఆహార భద్రతను నిర్ధారించడానికి ఆహార ధాన్యాల శాస్త్రీయ నిల్వపై అంతర్జాతీయ శిక్షణ పొందుతున్నారు. అదే విధంగా ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (ఐటిఈసి) భాగస్వాములు భాగస్వామ్య దేశాల నుండి అధికారులు, నిపుణులు, విద్యావేత్తలు (ఆసియా, ఆఫ్రికా, తూర్పు ఐరోపా మొదలైన వాటిలో 160కి పైగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన వారు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ద్వారా ఐటిఈసి ప్రోగ్రామ్ లో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

## - సడక్ సురక్ష అభియాన్ ర్యాలీ

## - సివిల్ జడ్జి జూనియర్ సివిల్ జడ్జి రవీందర్




**కుషాయిగూడ, జనవరి 08, (తెలంగాణ దిశ)** :రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మేడ్చల్, మల్కాజిగిరి సివిల్ జడ్జి జూనియర్ సివిల్ జడ్జి రవీందర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు కుషాయిగూడ పోలీసుల ఆధ్వర్యంలో ఆద్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ విద్యార్థులతో కలిసి గురువారం రోడ్డు సురక్ష అభియాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కుషాయిగూడ ఆద్య జూనియర్ కళాశాల నుండి ప్రారంభమై ఈసీఐఎల్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారితో రోడ్డు సేఫ్టీ ప్రతిజ్ఞ చేయించారు. రహదారులపై నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించ వచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, సబ్ ఇన్ స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, కోర్టు సిబ్బంది, ఇతరులు పాల్గొన్నారు. రహదారులపై జరుగుతున్న ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, ముఖ్యంగా యువత నిబంధనలను కచ్చితంగా పాటించేలా ప్రోత్సహించడం ఈ ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

## - భద్రాచలం మోటార్ వెహికిల్ ఇన్ స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య






**భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 08, (తెలంగాణ దిశ)** :ఇప్పటి వరకు ఎంతో సహనంగా ప్రతి ఒక్కరిని హెల్మెట్ పెట్టుకోవాలని రెండు చేతులతో దండాలు పెట్టిన వెహికల్ ఇన్ స్పెక్టర్ ఒక్కసారిగా జాతీయ రహదారి పై వెళ్లే వాహనదారులను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీలు చేస్తూ ఆ యొక్క వాహన దారుడు వద్ద సంబంధిత వాహన ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా లేవా అని చెకింగ్ చేశారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఒక వాహనాన్ని సీజ్ చేశారు. వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు వాహనాల చట్టం ప్రకారం తప్పనిసరిగా ఉండాలని, అదే విధంగా పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోవడం బ్లాక్ ఫిలిమ్స్ వినియోగం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని సంగం వెంకట పుల్లయ్య హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా అరికట్టాలంటే రవాణా శాఖ అధికారుల చర్యలతో పాటు ప్రజల బాధ్యతాయుతమైన భాగస్వామ్యం అనివార్యమని ఆయన అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలు సందర్భంగా 2026లో భాగంగా రవాణా శాఖ కార్యాలయంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట పుల్లయ్య మాట్లాడుతూ అందరూ మంచిగా ఉండాలని ఆకాంక్షంచారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపటం, మొబైల్ ఫోన్ వినియోగం ట్రాఫిక్ నిబంధనలు నిబంధనలు ఉల్లంఘనలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సహాయం చేసే మంచి ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలని ప్రధాన కారణంగా వాహన దారులను కోరారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదోళ్ల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత కెసిఆర్ దే

## - బిఆర్ఎస్ ఎల్ పి విప్, ఎమ్మెల్యే వివేకానంద్






**కుత్బుల్లాపూర్, జనవరి 08, (తెలంగాణ దిశ)** :నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీ ఫ్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అండ్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క నిరుపేద కుటుంబ సొంతింటి కలను నెరవేర్చిన ఘనత కేసీఆర్ దేనిని అన్నారు. ప్రైవేట్ డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు ఏ మాత్రం తీసిపోకుండా అన్ని సదుపాయాలతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందజేసి దేశంలోనే మరెక్కడా లేని విధంగా విశాలవంతమైన డబుల్ బెడ్ రూమ్ సముదాయాలను ఇచ్చిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నెలకొని ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, రానున్న రోజుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రధాన చేశారు. నూతన కమిటీ చైర్ పర్సన్ మహమ్మద్ ఫర్జానా సలీం, ఉపాధ్యక్షులు దమయంతి బిపిన్, ప్రధాన కార్యదర్శి ఎం. కేజియా రాజు, కోశాధికారి షేక్ అజ్మీరి అహ్మద్ లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, నిజాంపేట సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు బాలాజీ నాయక్, పెద్దిరెడ్డి సుజాత, రాఘవేంద్రరావు, రవి కిరణ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ డివిజన్ లోని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

## - కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకులు

## -నెమలి అనిల్ కుమార్

## - బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ విద్యుత్ ఏఈ విజయతో పర్యటన





**మల్లాపూర్, జనవరి 08, (తెలంగాణ దిశ)** :మల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు అనిల్ కుమార్ కోరారు. గురువారం బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ ఏఈ విజయతో కలిసి మల్లాపూర్ లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయా కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ ఇబ్బందులను ఆమెకు వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఏఈ విజయ సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో మల్లాపూర్ లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖా అధికారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## నినాదంగా అవినీతి అంతం

భారతదేశంలో అవినీతి అన్ని రంగాల్లో, అన్ని రకాల సేవల్లో పేరుకుపోయింది. రేషన్ కార్డ్ పొం దడం నుంచి పరిశ్రమల స్థాపన వరకు అన్నిచోట్ల చేయి తడపాల్సిన దుస్థితి ఏర్పడింది. చిన్న చిన్న పనులు చేసే కాంట్రాక్టర్లకు తమ పనులు జరగాలంటే అవినీతి అనే ఆయుధాన్ని ఉపయోగించాల్సిందే. ప్రభుత్వసేవలందించే ఉద్యోగులు.. వారి సేవలు పొందే ప్రజల మధ్య అవినీతి రాజ్యమేలుతుంది. ప్రభుత్వం ఉచితంగా అందించే విద్య, వైద్య సేవల్లోనూ లంచం ఇవ్వందే పనులు జరగడం లేదు. అవినీతికి పాల్పడిన అధికారులను శిక్షించే చట్టాలు ఉన్నప్పటికీ, హెచ్చరికలు చేస్తున్నప్పటికీ సమాజంలో అవినీతి మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. అవినీతి, అధికారం ఒకే నాణేనికి రెండు ముఖాలుగా మారిపోయాయి. ప్రపంచమంతటా పేరుకున్న అవినీతి,దాని నిర్మూలనకు ఉన్న చట్టాలపై కనీస అవగాహన, తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అర్థమయ్యేలా వివరించడం జరుగుతుంది. 2003, అక్టోబర్ 31న ఐక్యరాజ్యసమితి అవినీతి వ్యతిరేక ఒప్పందాన్ని ఆమోదించింది. దానిపై సమితిలోని 190 సభ్యదేశాలు సంతకాలు చే యడంతో ప్రపంచంలో అవినీతిపై పోరాటాన్ని చట్టపరమైన విధిగా పరిగణించడం మొదలైంది. ఇదే సదస్సులో ప్రతి ఏడాది డిసెంబర్ 9న ప్రపంచవ్యాప్తంగా 'అవినీతి వ్యతిరేక దినోత్సవం' జరపాలని ఐరాస నిర్ణయించింది. ప్రపంచంలో అవినీతి లేని దేశం, రం గం లేకపోవడాన్ని ఊహించలేం. అవినీతి అనేది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఒక క్యా న్సర్ ముప్పుగా మారింది. పేదల అభివృ ద్ధి కోసం అమలుచేసే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందని స్థితి నెలకొన్నది. వారి అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాల్లో అవినీతి ఉన్న కారణంగా ఆశించిన ఫలితాలు రావడం లేదు. పేదవర్గాల జీవన ప్రమాణాలు, కొనుగోలు శక్తి పెరగక 'సామాన్యుని సాధికారిత' అనేది ఒక కలగానే మిగిలిపోతున్నది. అవినీతి నిర్మూలనకు వ్యతిరేకంగా మన దేశంలో ప్రభుత్వాలు, ఎన్జీఓలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా అవినీతి వ్యతిరేక పోరాటాలు చేసినప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. ఈ ఏడాది అవినీతి సూచీలో భారత్ ర్యాంకు మరింత దిగజారడమే దీనికి ఉదాహరణ. ప్రపంచ దేశాల అవినీతి సూచీలో భారత్ స్థానం అంతకంతకూ దిగజారుతుండడం ఆందోళన కలిగించే అంశమని చెప్పొచ్చు. ప్రభుత్వ స్థాయిలో అవినీతి ఏ మేరకు రాజ్యమేలుతుందనేది నిపుణులు, వ్యాపారవేత్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' అనే సంస్థ సున్నా నుంచి 100 పాయింట్లను కేటాయిస్తుంది. సున్నా అయితే అవి నీతి ఎక్కువని, 100 అంతకంటే ఎక్కువగా ఉంటే అవినీతి రహితమని పేర్కొంటుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ట్రాన్స్‌పరెన్సీ ఇం టర్నేషనల్ సంస్థ వెల్లడించిన అవినీతి సూచీకి సంబంధించి 180 దేశాలపై సర్వే నిర్వహించింది. ఈ అధ్యయనంలో భారత్ 38 పాయింట్లతో 96వ స్థానంలో నిలిచింది. 2023లో 39 పాయింట్లతో 93వ స్థానంలో ఉంటే, 2022లో 40 పాయింట్లతో 85వ స్థానంలో నిలవడం గమ నార్హం. తాజాగా భారత్ 96వ స్థానంలో ని లవడం చూస్తుంటే దేశంలో అవినీతి ఏ మేర రాజ్యమేలుతుందనేది అర్థమవుతుంది. అవినీతి చిన్నగా మొదలై ఏడు తలల విషనాగులా మారిపోయింది. ఒక్క భారత దేశంలోనే అవినీతి పుట్టలు కోకొల్లలుగా ఉన్నాయి. ముఖ్యంగా రాజకీయాల్లో ఉ న్నంత అవినీతి మరెక్కడా లేదు. అవినీతి అడ్రస్ రాజకీయాలే. ఇది ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. కనీస మౌలిక వస తులు కూడా ఇవ్వకుండా రోజు రోజుకూ బీదవారిగా మార్చేస్తుంది. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకూ.. దేశాల నుం చి విదేశాల వరకూ అన్ని చోట్లా అవినీతి పంజా విసురుతూనే ఉంది. అవినీతి వల్ల మానవహక్కుల ఉల్లంఘన జరుగుతుంది. దీనితో నేరాలు పెరుగుతున్నాయి. పేదరికంలో ఉన్న దేశాల్లో అవినీతి తక్కువగానే ఉన్నప్పటికీ.. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అవినీతి మాత్రం ఎక్కువగానే ఉంటుంది. ఒకప్పుడు లంచం తీసుకోవడాన్ని అడ్డుకునే జనం మొన్నటి ఎన్నికల్లో జనం ఏ పార్టీ ఎక్కువ ముట్టజెప్పుతుందో ఆ పార్టీకి మాత్రమే ఓటు వేస్తామని బహిరంగంగా ప్రకటించింది. మరి పార్టీలు కూడా గెలిచాకా ప్రజలకు కష్టపడి సంపాదించుకునే విధానాన్ని మార్చి ఉచితాలను అందిస్తుం ది. దీంతో ఉచితాలకు జనం మరుగుతున్నారు. ఇంతటి తెగింపుకు రావడానికి భారతదేశంలోపెరిగిపోతున్న అవినీతి మాత్ర మే కారణం. ఒక ఉద్యోగం కొన్న ఉద్యోగి, లంచంతో పని జరిపించుకున్న సామాన్యడు ఇలా ప్రతి ఒక్కరూ తమ హక్కును కాలరాసి అవినీతి వైపు మొగ్గుచూపుతూనే ఉన్నారుఅదే హక్కుగా భావిస్తున్నారు. ప్ర భుత్వం, ప్రైవేటు ఇలా ఏ రంగం చూసుకు న్నా డబ్బులు ఇవ్వనిదే పని జరగని స్థాయి కి చేరుకుంది. ప్రభుత్వ నిధులు, పాలసీలు, పథకాలు అల్లంత దూరాన ఆగిపోతున్నా యి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే పలు అభివృధ్ధి సంక్షేమ పథకాల అమలులో జరుగుతున్న కుంభకోణాలు అవినీతికి అడ్డాగా మారి అభివృద్ధిని అడ్డుకుంటుందనడంలో సందేహం లేదు. అవినీతిని అంతమొందించేందుకు నీతి నిజాయితీ అనే ఉద్యమానికి నడుం కట్టా లి. అవినీతికి వ్యతిరేకంగా దేశంలోని ప్రతి కుటుంబం ఒక యూనిట్‌గా మారాలి. నీతి, నిజాయితీ, మానవీయ విలువలు వంటి అంశాలను పాఠశాల, కళాశాలల స్థాయిలో పాఠ్యాంశంగా చేర్చాలి. అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేసేలా విద్యార్థులకు అవగాహన కలిగించాలి. యువత లో అవినీతి నిర్మూలన చట్టాల మీద సదస్సులు, సమావేశాలు నిర్వహించాలి. నీతి నిజాయితీతో చట్టబద్ధంగా విధులు నిర్వర్తించే ఉద్యోగులను అవార్డులతో సత్కరిం చాలి. ప్రజల్లో ప్రశ్నించే తత్వం.. పాలకుల్లో, అధికారుల్లో జవాబుదారీతనం, పారదర్శకత పెరిగినప్పుడే అవినీతి అంతమయ్యే అవకాశముంటుంది. ప్రభుత్వ రంగ సంస్థలు విడుదల చేస్తున్న నిధులు.. పనితీరును పారదర్శకంగా చూపగలిగితే కొంత మేర అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చు. ప్రతీ పౌరుడికి ఆయుధమైన సమాచార హక్కు చట్టాన్ని మరింత పటిష్టం చేసి అవినీతికి పాల్పడుతున్న అధికారులు, వ్యవస్థకు సం బంధించిన సమాచారాన్ని సేకరించి కోర్టులలో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేసే అవకాశాన్ని మరింత వేగవంతం చేయాలి. అవినీతి నిర్మూలనను ప్రతి పౌ రుడు ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాల్సిన అవసరముంది. ఎవరోవస్తారు..ఏదో చేస్తారు అనేది వదిలిపెట్టి ప్రతీ పౌరు డు చైతన్యం ప్రదర్శించి అవినీతిని పారద్రోలేందుకు ఉద్యమం చేయాలి. అవినీతి నిర్మూలన చట్టాలపై అవగాహన పెంచుకొని దేశాన్ని, రాష్ట్రాలను అవినీతి రహితంగా మార్చుకుందాం. ప్రభుత్వం, పౌరసమాజం, మహిళా శక్తి, యువత, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా ఉద్యమించి అవినీతి ర హిత భారత్ నిర్మాణానికి పాటుపడదాం.

# మహిళల సంక్షేమం, సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## ఏఎస్ రావునగర్ లో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

## కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్







**ఏఎస్ రావునగర్, జనవరి 08, (తెలంగాణ దిశ) :** సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో విజేతలైన వారికి ఈ సందర్భంగా బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గొప్ప పండుగ అని అన్నారు. మహిళలు, కుటుంబం, సమాజానికి పునాది అని, అలాంటి మహిళల ప్రతిభను, సృజనాత్మకతను వెలుగులోకి తీసుకురావడానికే మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించామని తెలిపారు. మహిళల కళా నైపుణ్యం, ఓర్పు, ఐక్యత ఈ పోటీల ద్వారా స్పష్టంగా కనిపించిందని, ఇలాంటి కార్యక్రమాలు మహిళల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. భవిష్యత్తులో కూడా మహిళల కోసం మరిన్ని సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహిళల సంక్షమం, సాధికారతకు కట్టుబడి ఉందని, మహిళలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా డివిజన్ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, పాకాల రాజు, అజీజ్, అల్లురయ్య, సంఘ సేవకురాలు నాగ మల్లేశ్వరి, రత్న ప్రసాద్ సుబ్బారావు, మేదరి రామలింగం, శ్రీకాంత్ రెడ్డి, లింగస్వామి, మేఘరాజు, సాహెబ్, బి. నర్సింహా, ప్రభాకర్, మహిళా నాయకురాళు భవాని, సునీత, సంధ్య, మాధవి, రాణి, పద్మ, విజయలక్ష్మి, నిర్మల, పల్లవి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.



# క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఉన్నతాధికారుల అభినందనలు

**భద్రాద్రి కొత్తగూడెం,జనవరి 08, (తెలంగాణ దిశ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో తెలంగాణ రాష్ట్ర ఎస్ జీఎఫ్ 69వ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాల టీంలు ఇందులో పాల్గొన్నాయి. విన్నర్స్ గా రంగారెడ్డి, రన్నర్స్ గా ఖమ్మం జిల్లా టీంలు కప్ ను గెలుచుకున్నారు. త్వరలో రాజస్థాన్ లో జరగనున్న పోటీలలో 14 ఎస్ జి ఎఫ్ క్రికెట్ నేషనల్ లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టులో భద్రాచలం చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ నుండి ముగ్గురు క్రీడాకారులు జట్టుకు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, భద్రాచలం ఎస్ పి విక్రాంత్ సింగ్ ఈ ముగ్గురు క్రికెట్ క్రీడాకారులను అభినందించారు. రాజస్థాన్ క్రికెట్ టోర్నమెంట్ లో నక్క రిత్విక్, రిషికేష్, పంజా విశ్రుత్ కృష్ణలు ఎంపిక అయ్యారు. వీరి ఎంపిక పట్ల చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ కోచ్ కుప్పాల తేజ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ అకాడమీ నుండి ముగ్గురు ప్లేయర్స్



రాజస్థాన్ లో జరగనున్న ఎస్ జీఎఫ్ క్రికెట్ అండర్ 14 నేషనల్ కు సెలెక్ట్ కావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. గెలుపొందిన జట్లకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

# పరామర్శ....



**కుత్బుల్లాపూర్, జనవరి 08, (తెలంగాణ దిశ) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం లోని 281 డివిజన్ రంగారెడ్డి నగర్ లోని రంగారెడ్డి నగర్ శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను (కృష్ణ, నరసింహ) కుత్బుల్లాపూర్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే శ్రీ కూన శ్రీశైలం గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ సూర్యనారాయణ



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రంగారెడ్డి నగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేవేందర్ మోకాలి ఆపరేషన్ చేయించుకున్న సందర్భంగా వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోటే శ్రీనివాస్ యాదవ్, శెట్టి బలిజ సంఘం నాయకులు భాస్కర రావు, దుర్గాప్రసాద్, నరసింహమూర్తి, చలపతిరావు, రాంబాబు, రామకృష్ణ, మరియు రంగారెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు బాలరాజ్, రమేష్ మంజూల్కర్, బండారు నారాయణ, షాకీర్, తోకల శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ రెడ్డి, రాకేష్, రామగిరి తదితరులు పాల్గొన్నారు

# రోడ్లపై వెలిసిన బోర్డులను తొలగిస్తాం

**- కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ లక్ష్మణరాజు**




**కుషాయిగూడ, జనవరి 08, (తెలంగాణ దిశ) :** రోడ్లపై ప్రమాదకరంగా వ్యాపార ప్రకటనల బోర్డును ఏర్పాటు చేయడం సరికాదని కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ లక్ష్మణరాజు పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని డి మార్ట్ శివ సాయి నగర్ చౌరస్తాలో అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం అక్రమంగా ప్రమాదకరంగా రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన వ్యాపార ప్రకటన బోర్డును గురువారం సాయంత్రం కాలనీ, సిసిఎస్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ లక్ష్మణరాజు మాట్లాడుతూ బాక్స్ డ్రైన్ నిర్మాణానికి అనుకొని ఏర్పాటు చేసిన అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ వ్యాపార బోర్డులను తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సబ్ ఇన్ స్పెక్టర్లు మధు, శివ సాయి నగర్, కాలనీ కమిటీల సమాఖ్య అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, బర్ల రామచంద్రారెడ్డి, కొండగళ్ల అశోక్, బత్తుల రాజిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమమేధకు మైక్రోసాఫ్ట్ భారీ పెట్టుబడులు

## మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్యా నాదెళ్ల వెల్లడి

బెంగుళూరు : భారత్‌లోని కృత్రిమమేధ వ్యవస్థకు తగిన రీతిలో మైక్రోసాఫ్ట్ సంస్థ భారీ పెట్టుబడులు పెడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల తెలిపారు. క్లోడ్ కంప్యూటింగ్ వ్యవస్థను కూడా మైక్రోసాఫ్ట్ మరింత పటిష్టం చేసేందుకు పనిచేస్తున్నట్లు చెప్పారు. మైక్రోసాఫ్ట్ చైర్మెన్, సీఈవో సత్యా నాదెళ్ల ఇవాళ బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. లక్షలాది మంది భారతీయులకు కృత్రిమ మేధపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. భారత్‌లో పెట్టుబడి పెట్టడం ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు. ఉత్తమైన మౌళిక సదుపాయాల్ని కల్పించనున్నట్లు చెప్పారు. సుమారు 17.5 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెడుతున్నట్లు సత్యానాదెళ్ల తెలిపారు. ఆసియా ఖండంలోనే మైక్రోసాఫ్ట్‌కు చెందిన అత్యంత భారీ పెట్టుబడి ఇదేఅని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా క్లౌడ్ ఎట్‌ఫామ్ విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ చైర్మెన్ తెలిపారు. అజూర్ కంప్యూటర్ వ్యవస్థపై వర్క్ చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 70 కన్నా ఎక్కువ సంఖ్యలో డేటా సెంటర్లు ఉన్నాయన్నారు. భారత్‌లోనూ మైక్రోసాఫ్ట్ సెంటర్లు పెరుగుతున్నట్లు



ఆయన చెప్పారు. గిట్‌హబ్ లో 2030 నాటికి ఇండియా నెంబర్ వన్‌గా మారుతుందని ఆయన అంచనా వేశారు. భారత్‌లో జియోతోనూ భాగస్వామ్యం ఉందన్నారు. 2026లో కొత్త డేటా సెంటర్ ప్రాంతం ఆపరేషనల్‌గా మారనున్నట్లు నాదెళ్ల చెప్పారు. దక్షిణమధ్య భారతంలో కొత్త డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోనున్నట్లు నాదెళ్ల పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సుమారు రెండు కోట్ల మంది భారతీయులకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు నాదెళ్ల తెలిపారు.

# నిధుల మంజూరికి కృషి చేసిన ఎంపీ అర్వింద్

## కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల, : :జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని వివిధ బ్రిడ్జిలు నిర్మాణం కోసం నిధులిప్పించాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గతంలోనే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కుమార్ ను కోరారు. జగిత్యాల ఎమ్మెల్యే విన్నపాన్ని గుర్తుంచుకొన్న నిజామాబాద్ ఎంపీ అర్వింద్ గత రెండు రోజుల క్రితం కేంద్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిసిన ఎంపీ అర్వింద్ అవసరాన్ని వివరించడంతో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని అంతర్గాం, అంబరిపేటల మధ్య ఫ్లై ఒవేర్, అండర్ పాస్ నిర్మాణం, ఆనంతారం వద్ద హై లెవల్ వంతెన, చల్ గల్, సింగరావుపేట, ఇటిక్యాల గ్రామాల మధ్యలో హైలెవల్ బ్రిడ్జి, బోర్నపెల్లి, జగన్నాథ్ పూర్ మధ్య హైలెవల్ వంతెన నిర్మాణం కోసం జగిత్యాల లో ఇటీవలే జరిగిన దిశ మీటింగ్ లో ఎంపీ అర్వింద్ ను కోరడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ఆరోగ్యానికి చిన్నపరీక్ష!



జెస్టేషనల్ డయాబెటిస్.. మహిళల్లో గర్భధారణ సమయంలో కనిపిస్తుంది. చాలామందిలో ప్రసవం తర్వాత తగ్గిపోతుంది. కానీ, మూడింట ఒకవంతు మంది మహిళలు.. డెలివరీ తర్వాత కూడా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారట. ఈ క్రమంలో కాన్పు తర్వాత 'గ్లూకోజ్ టాలరెన్స్ టెస్ట్' చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు. కానీ, చాలామంది మహిళలు ఈ పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. ప్రసవం తర్వాత పిల్లల కోసమే పూర్తి సమయాన్ని కేటాయిస్తూ.. తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. 'టాలరెన్స్ షుగర్ పరీక్ష'కు చాలామంది మహిళలు విముఖత చూపుతున్నారని తాజా పరిశోధన ఒకటి తేల్చింది. కెనడాకు చెందిన లునెన్‌ఫీల్డ్ – టానెన్‌బామ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ చేపట్టిన ఈ పరిశోధన వివరాలను 'డయాబెటిస్ కేర్' ప్రచురించింది. ఇందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. 'గ్లూకోజ్ టాలరెన్స్' పరీక్ష చేయించుకోవాలంటే.. బాలింతలు రాత్రిపూట ఉపవాసం ఉండి, మరుసటి రోజు ఉదయం పరీక్షకు రావాల్సి ఉంటుంది. శాంపిల్ ఇచ్చిన తర్వాత.. ఆహారం తీసుకొని, మళ్లీ రెండు గంటలపాటు వేచి ఉండి, మరోసారి రక్తం శాంపిల్ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో, ఎక్కువ సమయంపాటు వేచి చూడటం, రాత్రిపూట ఉపవాసం.. ఇలాంటి కారణాలతో మహిళలు ఈ పరీక్ష చేయించుకోవడానికి విముఖత చూపుతున్నారట. ఈ సమస్యను గుర్తించిన అంతర్జాతీయ డయాబెటిస్ సమాఖ్య..
ఈ పరీక్ష వ్యవధిని ఒక గంటకు తగ్గించాలని సిఫార్సు చేసింది. ఇలా, ఒక గంటలో పూర్తిచేసే పరీక్ష.. రక్తంలో చక్కెర స్థాయిలను కచ్చితంగా అంచనా వేస్తుందని పరిశోధనలో తేలింది. ఇందులో భాగంగా.. 369 మంది మహిళలను ఎంపికచేసింది. వీరిలో కొందరికి ప్రసవానంతరం రెండు గంటల టాలరెన్స్ టెస్ట్ చేయగా.. మరికొందరికి గంటలో పూర్తయ్యే పరీక్ష నిర్వహించారు. ఆశ్చర్యకరంగా.. రెండు రకాల పరీక్షల ఫలితాలు సరిపోలినట్టు పరిశోధకులు వెల్లడించారు. ఈ చిన్న పరీక్షతో భవిష్యత్తులో షుగర్ వ్యాధి ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

# వాల్ నట్స్‌ను రోజూ తింటే ఎన్ని పోషకాలు లభిస్తాయో తెలుసా..



మన శరీరానికి పోషకాలను అందించే ఎన్నో రకాల ఆహారాలు మనకు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా సరే తమ ఇష్టాలు, అభిరుచులకు అనుగుణంగా, తమ స్థోమతను బట్టి ఆయా ఆహారాలను తింటుంటారు. అయితే పోషకాల విషయానికి వస్తే మనకు నట్స్ ఎంతో దోహదం చేస్తాయని చెప్పవచ్చు. నట్స్‌లో వాల్ నట్స్ మనకు ఎక్కువ లాభాలను అందిస్తాయి. కానీ జీడిపప్పు, బాదంపప్పు అంటే చాలా మందికి ఇష్టంగా ఉంటుంది. వాల్ నట్స్ ను వాటి రుచి కారణంగా చాలా మంది తినరు. అయినప్పటికీ వీటిల్లోనే పోషకాలు అధికంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాల్ నట్స్‌ను రోజూ నానబెట్టి తినాలని వారు సూచిస్తున్నారు. వాల్ నట్స్‌లో మన శరీరానికి అవసరం అయ్యే అనేక పోషకాలు ఉంటాయి.

అధిక బరువు తగ్గుతారు..: వాల్ నట్స్‌లో ఆల్ఫా–లినోలీనిక్ యాసిడ్ (ఆలా) అనే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తాయి. అలాగే మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. మెదడు యాక్టివ్‌గా పనిచేసేలా చేస్తాయి. వాల్ నట్స్‌లో ప్రోటీన్ల కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి శరీర కణజాలాన్ని పునర్నిర్మించేందుకు సహాయ పడతాయి. కణజాలం మరమ్మత్తులకు గురై ఆరోగ్యంగా ఉంటుంది. కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వాల్ నట్స్‌ను తీసుకోవాలి. వాల్ నట్స్‌లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. కొవ్వు కరుగుతుంది. ముఖ్యంగా పొట్ట దగ్గర ఉన్న కొవ్వు తొలగిపోతుంది.

చర్మ సంరక్షణకు..: వాల్ నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించబడతాయి. దీంతో కణాలు డ్యామేజ్ అవకుండా ఆరోగ్యంగా ఉంటాయి. వాల్ నట్స్‌ను తింటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మం కాంతివంతంగా మారి తేమగా ఉంటుంది.
మృదువుగా మారుతుంది. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. వాల్ నట్స్‌లో ఫోలేట్ (విటమిన్ బి9) అధికంగా ఉంటుంది. ఇది డీఎన్ఏ ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఎర్ర రక్త కణాలు తయారయ్యేందుకు దోహదం చేస్తుంది. కనుక వాల్ నట్స్‌ను గర్భిణీలు తింటే శిశువులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. వారిలో పుట్టుక లోపం రాకుండా చూడవచ్చు.

కండరాల పనితీరుకు..: వాల్ నట్స్‌లో మెగ్నిషియం అధికంగా ఉంటుంది. ఇది కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది. కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు రోజూ వాల్ నట్స్‌ను తింటుంటే ప్రయోజనం ఉంటుంది. అలాగే వాల్ నట్స్‌లో ఉండే మెగ్నిషియం ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. దీని వల్ల మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. వాల్ నట్స్‌లో అధికంగా ఉండే ఫాస్ఫరస్ ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. వాల్ నట్స్‌ను రోజూ తినడం వల్ల వృద్ధాప్యంలో ఆస్టియోపోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకల సంబంధిత సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ఇలా వాల్ నట్స్‌ను రోజూ తింటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# తిప్పతీగ రసంలో పసుపు కలిపి తాగితే ఎన్ని లాభాలు ఉంటాయో తెలుసా..





ఆయుర్వేదంలో ఎన్నో రకాల మూలికలు, మొక్కలు మనకు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల మొక్కలు మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతాయి. కానీ అలాంటి ఔషధ మొక్కల గురించి చాలా మందికి తెలియదు. వాటిల్లో తిప్పతీగ కూడా ఒకటి. తిప్ప తీగ కాండం లావుగా ఉంటుంది. దీన్ని చాలా సులభంగా గుర్తించవచ్చు. ఈ మొక్క తీగ జాతికి చెందినది. మన ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లోనే పెరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో తిప్పతీగ మనకు ఎక్కువగా కనిపిస్తుంది. తిప్ప తీగ ఆకుల నుంచి రసం తీసి తాగవచ్చు. ఈ రసంలో కాస్త పసుపు కలిపి తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేదం చెబుతోంది. తిప్పతీగ అనేక వ్యాధులను నయం చేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

రోగ నిరోధక వ్యవస్థకు..: తిప్పతీగ రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తీసుకుని దాన్ని ఒక కప్పు నీటిలో కలపాలి. అందులోనే కాస్త పసుపు, మిరియాల పొడి, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని రోజూ ఉదయం పరగడుపున తాగాలి. ఈ పదార్థాలు కొందరిలో అలర్జీలను కలిగించవచ్చు. కనుక అలర్జీ సమస్య ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తాగకూడదు. ఈ విధంగా తయారు చేసిన తిప్పతీగ మిశ్రమాన్ని తాగితే అనేక లాభాలు కలుగుతాయి. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల అనేక ఔషధ గుణాలు లభిస్తాయి. అనేక రోగాలను తగ్గించుకోవచ్చు. దీంతో

## అనేక వ్యాధులు నయమవుతాయి..!

రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరిగి శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. ఎలాంటి రోగం అయినా సరే తగ్గిపోతుంది.

కీళ్లు, మోకాళ్ల నొప్పులకు..: తిప్పతీగ మిశ్రమంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలోని వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. దీంతో ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల సమస్యతో బాధపడుతున్నవారు రోజూ ఈ మిశ్రమాన్ని తాగితే ఫలితం ఉంటుంది. ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే మోకాళ్ల నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని సేవించడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలు ఉండవు. అలాగే కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే ఎంతో ఫలితం ఉంటుంది.

డయాబెటిస్ అదుపులో..: తిప్పతీగలో షుగర్‌ను తగ్గించే గుణాలు ఉంటాయి. అలాగే ఈ మిశ్రమంలో కలిపిన అన్ని పదార్థాలు కూడా షుగర్‌ను గణనీయంగా తగ్గిస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ సేవిస్తుంటే షుగర్‌ను కంట్రోల్ చేయవచ్చు. దీంతో డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. తిప్పతీగ, పసుపులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక ఈ మిశ్రమాన్ని సేవిస్తుంటే మొటిమలు, వాపులు తగ్గుతాయి. ముఖంపై ముడతలు, మచ్చలు తగ్గిపోతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తుంది. చర్మం మృదువుగా కూడా ఉంటుంది. ఈ మిశ్రమం ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ మీరు ఏదైనా వ్యాధికి మందులను వాడుతుంటే ఆయుర్వేద వైద్యులను సంప్రదించి దీన్ని వాడడం ఉత్తమం. లేదంటే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంటుంది.

# వ్యర్థం కాదు.. బలం!



చెత్తబుట్టలో పడేసే వంటింటి వ్యర్థాలు.. పెరటి మొక్కలకు బలాన్ని ఇస్తాయి. సహజసిద్ధమైన ఎరువుగా పనిచేసి.. మొక్కలు ఏపుగా పెరిగేందుకు సాయపడతాయి. మట్టిసారాన్ని పెంచడంతోపాటు రసాయనాల ముప్పునూ తగ్గిస్తాయి. మరి.. మొక్కల ఎదుగుదలను ప్రోత్సహించే ఆ పదార్థాలేంటో తెలుసుకుందామా!.%శ్రీ% ఆరోగ్యానికి మేలుచేసే గ్రీన్ టీ.. మొక్కల ఎదుగుదలలోనూ ముందుంటుంది. వేడినీటిలో ముంచి పక్కన పడేసిన 'గ్రీన్ టీ' బ్యాగుల్లోని తేయాకును ఒక గిన్నెలోకి తీసుకోవాలి. ఇది మొక్కలకు సహజ ఎరువుగా పనిచేస్తుంది. దీన్ని అలాగే మొక్కల మొదళ్లలో వేస్తే సరిపోతుంది. దీంతోపాటు ఒక లీటర్ నీటిలో కొన్ని గ్రీన్ టీ బ్యాగులు వేసి.. కొన్ని గంటల పాటు నాననివ్వాలి. ఆ తర్వాత టీ బ్యాగులను బాగా పిండేసి.. ఆ నీటిని మొక్కలపై పిచికారీ చేయాలి. ఇలా చేస్తే.. మొక్కలు మరింత ఏపుగా పెరుగుతాయి. మొక్కలను చీడపీడల నుంచి కాపాడటంలో ఉల్లిపొట్టు కీలకపాత్ర పోషిస్తుంది. బయట పడేసే ఉల్లిపొట్టును మొక్కల పొదల్లో వేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. ఐదు లీటర్ల గోరు వెచ్చని నీటిలో 20 – 30 గ్రా. ఉల్లిపొట్టు వేసి.. నాలుగు రోజులపాటు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని మొక్కలపై పిచికారీ చేస్తే.. మొక్కలకు బలం వస్తుంది. తొక్కే కదా!' అని పారేసే అరటి తొక్కలోనూ.. మొక్కలకు అవసరమయ్యే పోషకాలు ఎన్నో ఉంటాయి. అరటిపండు తొక్కల్ని మొక్కల మొదళ్ల వద్ద వేసి.. దానిమీద కొద్దిగా మట్టిని కప్పాలి. కొన్నిరోజులకు ఆ తొక్కలు మట్టిలో కలిసిపోయి.. ఎరువుగా మారుతాయి. ముఖ్యంగా, పూల మొక్కలు విరివిగా పూసేందుకు ఈ ఎరువు అద్భుతంగా పనిచేస్తుంది.

# అందానికి ఆహారం



వేసవిలో అందాన్ని కాపాడుకోవడం.. కొంచెం కష్టంగానే ఉంటుంది. ముఖ్యంగా చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. అదనపు జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. అయితే, బయటినుంచి ఎన్ని క్రీములు రాసినా, ఎంత మెరుగులు దిద్దినా మండే ఎండల్లో వ్యర్థమే అవుతుంది. సరైన ఆహారం తీసుకున్నప్పుడే.. వన్నె తగ్గని అందం సొంతమవుతుంది. ఈ క్రమంలో చర్మ సంరక్షణలో కొన్ని ముఖ్యమైన అంశాలను అందించే ఆహారాన్ని తీసుకోవాలని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్: వేసవిలో చర్మం హైడ్రేటెడ్‌గా ఉండాలంటే.. అవకాడో, పుచ్చకాయలు, దోసకాయలు, స్వీట్ పొటాటో, టమాటా, గ్రీన్ టీ.. తీసుకోవడం మంచిది. అవకాడోలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు.. శరీరానికి మరింత శక్తినిస్తాయి. ఇందులోని యాంటి ఏజింగ్ లక్షణాలు.. చర్మం ముడతలు పడకుండా కాపాడతాయి. స్వీట్ పొటాటో.. నేచురల్ సన్‌బ్లాక్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే బీటా కెరోటిన్.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుచ్చకాయలు, దోసకాయలు అధిక శాతం నీటితో నిండి ఉంటాయి. ఇవి చర్మాన్ని హైడ్రేట్ చేయడంతోపాటు ఇన్‌ఫ్లమేషన్, చికాకును తగ్గిస్తాయి. వడదెబ్బ వల్ల కలిగే నొప్పిని నివారిస్తాయి. విటమిన్లు: వేసవిలో దెబ్బతిన్న చర్మం మళ్లీ మెరుగ్గా మారాలంటే.. ఆహారంలో విటమిన్లు అధికంగా ఉండేలా చూసుకోవాలి. కొలాజెన్ ఉత్పత్తి కోసం ఆహారంలో విటమిన్ సి ఉండాలి. నారింజ, నిమ్మకాయలు, ద్రాక్షపండ్లలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. క్యారెట్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది చర్మంపై ముడతలు, గీతలు తగ్గించడంతోపాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ముందుంటుంది. కేల్ ఆకుకూర.. వేసవిలో అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులోని విటమిన్ ఎ.. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీన్ని సలాడ్, సూప్‌లో తీసుకోవడం ద్వారా.. ఇందులోని విటమిన్లన్నిటినీ శరీరానికి అందించవచ్చు. ఇక గ్రీన్ టీలో ఉండే శక్తిమంతమైన ఫ్లేవనాయిడ్స్.. చర్మాన్ని ఫ్రీరాడికల్స్ నుంచి రక్షిస్తాయి. చర్మం ఎక్కువగా సాగకుండా నిరోధించడంతోపాటు ముడతలు పడకుండా చూస్తాయి. ఉల్లి వెల్లుల్లి కలిపి తింటే..వంటింట్లో ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరిగా ఉంటాయి. దాదాపుగా అన్ని రకాల ఆహారాల్లో వీటిని వాడుతూ ఉంటారు.

# ఉల్లి, వెల్లుల్లి కలిపితింటే



ఏం జరుగుతుంది ఏమైనా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా దీనికి నిపుణులు చెబుతున్న సమాధానాలు ఇవిగో%ా%రెండిట్లో పోషకాలు: ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది. రెండిట్లోనూ యాంటి ఫంగల్, యాంటి బ్యాక్టీరియల్, యాంటి వైరల్ గుణాలు ఉంటాయి. కాబట్టి, వీటిని కలిపి తీసుకోవడం వల్ల మన రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పదేపదే జబ్బు పడకుండా ఉంటాం. మైగ్రెయిన్ నుంచి ఉపశమనం: అధిక రక్తపోటు (హైపర్ టెన్షన్) ఉన్నవాళ్లు ఉల్లి, వెల్లుల్లిని కలిపి తినాలి. ఇలా చేస్తే కొంతకాలానికి ఈ సమస్య నుంచి విముక్తి లభిస్తుందంటున్నారు నిపుణులు. అంతేకాదు, పార్శ్వపు నొప్పి (మైగ్రెయిన్)తో బాధపడుతున్న వారికి కూడా ఈ రెండు మంచి ఔషధాలుగా పనిచేస్తాయి. అయితే, ఇలా కలిపి తినడానికి ముందు డాక్టర్ సలహా తీసుకుని ఆచరించడం మంచిది. కొలెస్ట్రాల్‌కు బై బై: శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగినప్పుడు కూడా ఉల్లి, వెల్లుల్లి కలిపి తినడం మంచిది. ఇవి కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుతాయి. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తాయి. ఉల్లి, వెల్లుల్లిలో విటమిన్ బి, సి, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

# సోప్ నెయిల్స్ చూశారా !



నో మేకప్ లుక్ ఇప్పుడు ట్రెండింగ్. ఇంతకు మునుపులా లేయర్లు లేయర్లు మేకప్ వేసుకుని హీరోయిన్‌లా కనిపించాలన్న ట్రెండు పోయి, హీరోయిన్లు కూడా మేకప్ లేకుండా కనిపించాలనుకునే రోజులు వచ్చాయి. మనిషి ఎంత నేచురల్‌గా కనిపిస్తే అంత అందం అన్నట్టు భావిస్తున్నారిప్పుడు. గోళ్ల విషయంలోనూ అచ్చం అదే పోకడ వచ్చింది. 'సోప్ నెయిల్స్' ఫ్యాషన్ మనకు ఆ విషయాన్నే చెబుతుంది. చూడగానే లేత గులాబీ రంగులో, తెల్లగా, ఆరోగ్యంగా, అప్పుడే మెనిక్యూర్ చేసిన గోళ్లలా శుభ్రంగా కనిపించడం వీటి ప్రత్యేకత.
ఇందుకోసం లేత రంగుల్లో (న్యూడ్ షేడ్స్) ఉండే మ్యాటీ ఫినిష్ గోళ్ల రంగుల్ని ఎంచుకుంటున్నారు. పైన గాజులా కనిపించాలనుకుంటే గ్లాసీ ఫినిష్ కోట్‌కు ఓటు వేస్తున్నారు. కొంతమంది సబ్బు నురగల్ని పోలినట్టు లైట్‌గా కోట్‌ను వేస్తున్నారు. ఫేక్ నెయిల్స్ అదేనండీ ఆర్టిఫీషియల్ గోళ్లు పెట్టుకున్నా వాటిని ఇలాగే సింపుల్‌గా కనిపించేలా ముస్తాబు చేస్తున్నారు. ఫ్యాషన్ లేదా సింపుల్ లుక్ ఏదైనా అప్పుడే స్నానం చేసినట్టు శుభ్రంగా కనిపించే ఈ గోళ్లు చక్కగా సరిపోతాయి. ఆరోగ్యమే అసలైన అందం మరి అంటున్నాయన్న మాట ఈ ట్రెండింగ్ సోప్ నెయిల్స్!

# 'బరువెక్కుతున్న' భారత్



భారత్ ఊబకాయుల నిలయంగా మారుతున్నదని లాన్సెట్ నివేదిక హెచ్చరించింది. 2050 నాటికి దేశంలో 45 కోట్ల మంది ఊబకాయులు ఉంటారని అంచనా వేసింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా సగానికి పైగా వయోజనులు ఊబకాయం బారినపడతారని తేల్చింది. 2021లో చైనా తర్వాత భారత్‌లోనే స్థూలకాయులు ఎక్కువగా ఉన్నారని తెలిపింది. పిండి పదార్థాలు, తీపి పదార్థాలను తినడం తగ్గించి, ప్రొటీన్లను ఎక్కువగా తీసుకోకపోతే యువత, పిల్లలు స్థూలకాయం బారిన పడే ప్రమాదం మరింత పెరుగుతుందని హెచ్చరించింది.

## గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రొఫెసర్ అత్యాచారం ఫిర్యాదుతో పోలీసులు అరెస్ట్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ నగరంలోని జేఎన్టీయూలో దారుణం చోటు చేసుకుంది. గెస్ట్ ఫ్యాకల్టీపై ప్రొఫెసర్ లైంగిక దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకే సామాజిక వర్గం అంటూ నమ్మించి మరీ బాధితురాలిని ప్రొఫెసర్ వంచించాడు. ఉద్యోగం నుంచి తీసేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతూ.. భయపెడుతూ పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. చివరకు బాధితురాలి కాపురాన్ని కూడా కూల్చేశాడు కీచక ప్రొఫెసర్. వర్క్ ఉందంటూ బాధితురాలిని అర్ధరాత్రి వరకు తనతోనే ఉంచుకున్నాడు ప్రొఫెసర్. దీంతో భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో బాధితురాలు ఒంటరిగా ఉంటోంది. అంతేకాకుండా ఆమె ఒంటరితనాన్ని అవకాశంగా మలుచుకుని శారీరకంగా, మానసికంగా ప్రొఫెసర్ మరింతగా వేధింపులకు గురిచేశాడు. తన ఛాంబర్‌లో కూడా బాధితురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. రోజు రోజుకు ప్రొఫెసర్ వేధింపులు అధికమవడంతో బాధితురాలు తీవ్ర మానసిక వేదనకు గురైంది. ప్రొఫెసర్ వేధింపులు భరించలేక పోలీసులను ఆశ్రయించింది. దీంతో నిందితుడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రముఖ విశ్వ విద్యాలయంలో జరిగిన ఈ ఘటనపై విద్యార్థులు, ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## భార్యాభర్తల మధ్య గొడవలు

### మామను కత్తితో పొడిచి చంపిన అల్లుడు

**పటాన్‌చెరు,తెలంగాణ దిశ :** సంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. మామను అల్లుడు కత్తితో పొడిచి చంపడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధి బీరంగూడ కమాన్ సమీపంలో నివాసముండే చంద్రయ్య (58)ను అల్లుడు రామకృష్ణ కత్తితో పొడిచి హతమార్చాడు. రామకృష్ణకు భార్యకు మధ్య మనస్పర్థలు రావడంతో గత మూడు నెలలుగా భార్య తల్లి గారి ఇంటి వద్ద ఉంటున్నది. గురువారం సాయంత్రం చంద్రయ్య ఇంటికి రామకృష్ణ వచ్చి భార్యతో గొడవ పడుతుండగా చంద్రయ్య వారిని వారించాడు. ఆగ్రహానికి గురైన రామకృష్ణ అంతు చూస్తానని ఇంటికి వెళ్లి కత్తి తీసుకొని వచ్చి చంద్రయ్యను పొడిచి హత్య చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# 'నిఘా'పై వెనక్కి




"మీకు నేను రక్షణ కల్పిస్తాను. మీ నట్టింట్లోనే మకాం పెడతాను." అని ఎవరైనా అంటే ఎలా ఉంటుంది "మీ ఇంట్లోనే ఉంటాను. ఇదే శాసనం" అని హుకుం జారీ చేస్తే ఎలా ఉంటుంది కేంద్ర ప్రభుత్వం ఇటీవల సంచార్ సాథీ యాప్ పేరిట తెర మీదికి తెచ్చిన ఏకపక్ష వ్యవహారంలా ఉంటుంది. పౌరుల వ్యక్తిగత గోప్యత మీద నిఘా పెట్టిన ట్టు ఉంటుంది. రాజ్యాంగం కల్పించిన జీవించే ప్రాథమిక హక్కును హరించినట్టు ఉంటుంది. అందుకనే- చర్చ, సహజమైన విచక్షణా లేకుండా కేంద్రం పౌరుల జేబుల్లోకి చొప్పించాలనుకున్న నిఘా నేత్రపు నిర్వాకంపై పౌర సంస్థలూ, ప్రతిపక్షాలూ పెద్దఎత్తున అభ్యంతరం వ్యక్తం చేశాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నిర్ణయం నుంచి కేంద్రం వెనక్కు తగ్గింది. మోడీ సర్కారు ఆలోచనాధోరణికి, పౌరుల గోప్యతను హరించే నిరంకుశ విధానానికి ఈ ఉదంతం అద్దం పడుతుంది.

నేడు ప్రతి ఒక్కరి రోజువారీ పనుల్లోనూ మొబైల్ ఫోను ఒక కీలకమైన సాధనంగా ఉంది. కార్యాలయంగా, బ్యాంకుగా, వ్యక్తిగత సమాచారాల కేంద్రంగా, రాకపోకల రికార్డుగా, సర్వ సంబంధ వ్యవహారాల వారధిగా వర్ధిల్లుతోంది. ఇన్ని పనులకు వేదికగా ఉ ంది కాబట్టే %-% సైబర్ నేరగాళ్ళకూ సులభ లక్ష్యంగా మారింది. ఉన్న చోట నుంచే మోసపు ఉచ్చులు విసరటం, వివిధ రూపాల్లో డబ్బును దోచేయడం మామూలై పోయింది. ప్రలోభాలు, బెదిరింపులు, సమాచార తస్కరణలు, సొమ్ము చోరీలూ యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ సరికొత్త మోసాల నుంచి రక్షణ కావాలన్నా, మోసగాళ్ల ఆట కట్టించాలన్నా మళ్లీ సాంకేతిక నైపుణ్యమే దిక్కు. దీనికి తగిన ఉపకరణాల అభివృద్ధి, వాటిపై వినియోగదారుల్లో అవగాహన పెంపు కీలకం. ఆ పనిని ప్రభుత్వ సంస్థలు ఒక పద్ధతి ప్రకారం చేపట్టాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. మన దేశంలో 120 కోట్ల మంది సెల్‌ఫోన్లను వినియోగిస్తుంటే- అందులో మూడోవంతు మందికే ఆధునిక సమాచార వ్యవస్థల మీద కాస్తయినా అవగాహన ఉందని ఒక అధ్యయనంలో తేలింది. ఇలాంటి సందర్భంలో డిజిటల్ లిటరసీని పెంచటంపై ప్రభుత్వం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. కానీ, మోడీ షా ప్రభుత్వం దానికి భిన్నంగా ఏకపక్ష దూకుడుతో పౌరుల వ్యక్తిగత గోప్యతకు ఎసరు పెట్టేలా సంచార్ సాథీని రంగంలోకి తెచ్చింది. కొత్తగా వచ్చే ప్రతి మొబైల్‌లోనూ ఈ యాప్‌ని తప్పనిసరిగా ఎక్కించాలని సెల్ తయారీ కంపెనీలకు ఉత్తర్వులిచ్చింది. రానున్న మూడు నెలల్లో పౌరులు వాడుతున్న ప్రతి సెల్‌ఫోనులోనూ ఈ యాప్‌ను చేర్చాలని హుకుం జారీ చేసింది. అనేక యాప్‌ల వలె ఇది కూడా ఒకటి కదా దీనికి అభ్యంతరమెందుకని అనుకోవొచ్చు. వాస్తవానికి ఇది మిగతా అన్నింటిలాంటిది కాదని సాంకేతిక నిపుణుల మాట. అందుకనే ప్రముఖ తయారీ కంపెనీ ఆపిల్ %-% వినియోగదారుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే ఈ యాప్‌ను తాము ఇన్‌స్టాల్ చేయలేమని తేల్చి చెప్పింది. సంచార్ సాథీని మొబైల్‌లో జోడిస్తే- ఆ ఫోన్‌లోని డేటా మొత్తం దానికి షేర్ చేయటమే అవుతుంది. సంభాషణలు, సమాచారం, వినియోగదారుల కదలికలు, మొబైల్‌లో ఉంచిన సర్వ సమాచారమూ సంబంధిత అధికారుల చేతిలోకి చేరుతుంది. ఇదంతా పౌరులకు రక్షణ కల్పించటానికి, ఎవరు మోసానికి పాల్పడ్డా వెంటనే గుర్తించటానికి అని కేంద్రం సమర్థించుకునే ప్రయత్నం చేసింది. ఇది రక్షణ కాదుబీ వ్యక్తుల గోప్యత పరిధిలోకి చొచ్చుకురావటం, ప్రతి పౌరుడిని నిఘా నేత్రాల కిందికి తీసుకురావటం అని పౌర సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. కొద్దిమంది నేరగాళ్లను పట్టుకునే పేరుతో కోట్లాదిమందిపై కాపలా పెట్టటం పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయటమే అవుతుందని పేర్కొన్నాయి. గతంలో రాజ్యాంగ విరుద్ధంగా పాలకులు ప్రయోగించిన పెగాసస్ నిఘాలు, టెలిఫోను ట్యాపింగులూ వివాదాస్పదం అయ్యాయి. ప్రశ్నించే పలువురు మేధావుల ల్యాప్‌ట్యాపుల్లోకి, మెయిళ్లలోకి ప్రభుత్వం తాము అనుకున్న సమాచారాన్ని ప్రవేశపెట్టిందన్న ఆరోపణలు ఉన్నాయి. పాలకుల అణచివేతలు, పక్షపాత ధోరణులు అనేక సందర్భాల్లో వెల్లడయ్యాయి కనుకనే సంచార్ సాథీ మీద ఇంత అనుమానం, అభ్యంతరం. కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గటం ప్రజా విజయమే కానీ, అది మరొక దొంగ దారిలో చొచ్చుకురాదని చెప్పవేం. కాబట్టి పాలకుల ప్రతి ప్రజావ్యతిరేక చర్య మీదా పౌరులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాల్సిందే!

## ఇండిగో సంక్షోభం.. కుట్ర కోణంలో దర్యాప్తు



ముంబై, : ఇండిగో సంస్థకు సంబంధించిన విమానాలు అర్థంతరంగా ఆగిపోవడం మనదేశంలో తీవ్ర కలవరాన్ని కలిగించాయి.. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు విమానాశ్రయాలకు పరిమితమయ్యారు. ఉన్నట్టుండి విమానాలు ఆగిపోవడంతో ప్రయాణికులు నరకం చేశారు.. వాస్తవానికి విమానాలు ఆగిపోవడం మన దేశ చరిత్రలో ఇదే తొలిసారి.. ప్రకృతి విపత్తులు చోటు చేసుకున్నప్పుడు.. ఇతర సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు విమానాలను నిలిపివేస్తారు. కానీ ఎటువంటి కారణాలు లేకుండానే ఇండిగో సంస్థ విమానాలు ఆపివేయడం దేశవ్యాప్తంగా ఇబ్బందికరమైన వాతావరణాన్ని కలిగించింది. విమానాలు ఆగిపోవడం వెనక టర్కీ దేశం పాత్ర అనుమానాస్పదంగా కనిపిస్తోందని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇండిగో సంస్థకు టర్కీస్ ఎయిర్ లైన్స్ తో విస్తృతమైన కోడ్ షేర్ బాండింగ్ ఉంది. టర్కీస్ ఎయిర్లైన్స్ ను నేరుగా టర్కీ ప్రభుత్వమే నియంత్రిస్తోంది. కొన్ని సంవత్సరాలుగా భారత్, టర్కీ మధ్య అంత గొప్పగా సంబంధాలు లేవు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్ కు టర్కీ బహిరంగ మద్దతు పలికింది. దీంతో భారతీయ కంపెనీలు టర్కీని బహిష్కరించాయి.. అంతేకాదు టర్కీ అధ్యక్షుడి కుమార్తెకు ప్రయోజనం కలిగించే సెలేబి ఏర్పోర్ట్ సర్వీసెస్ కాంట్రాక్టు ను భారత రద్దు చేసింది. అహ్మదాబాదులో ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురికావడానికి ముందు మనదేశంలో టర్కీ దేశానికి చెందిన విమానాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత ప్రజలు సహజంగానే ఎయిర్ ఇండియా వైపు దృష్టిస్తారించారు. ఈ కుట్ర అనేక రకాలుగా మలుపులు తిరిగింది.. పుతిన్ మనదేశంలో పర్యటిస్తున్నప్పుడే పశ్చిమ దేశాలు సరికొత్త వ్యూహాలు అవలంబించాయి.. అయితే ఈ వ్యవహారం వెనుక టర్కీ మాత్రమే కాకుండా, ఇంకా చాలా దేశాలు ఉన్నాయని తెలుస్తోంది. 2020లో ట్రంప్ భారత్లో పర్యటిస్తున్నప్పుడు సిఎఎ వ్యతిరేక నిరసనలు ఎలా అయితే వ్యక్తమయ్యాయో.. పుతిన్ భారతలో పర్యటిస్తున్నప్పుడు కూడా పశ్చిమ దేశాలు అదే విధంగా అసౌకర్యానికి గురయ్యాయి. ప్రస్తుతం మన దేశంలో పెళ్లిళ్లు, ఇతర వేడుకలు విస్తృతంగా జరుగుతూ ఉ ంటాయి. ఈ మార్కెట్ మొత్తాన్ని స్తంభింప చేయడానికి ఈ విధమైన కుట్రలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఈ సంక్షోభానికి ఇండిగో సంస్థలో ఉన్న అంతర్గత బలహీనతలు కూడా ఒక కారణమని తెలుస్తోంది. పౌర విమానయాన శాఖ పైలెట్ ల విశ్రాంతి సమయాన్ని పెంచింది.. ఈ నిబంధనలను 2024 జనవరిలో విడుదల చేసింది. అయితే వీటిని ఇండిగో సంస్థ మాత్రం పాటించలేదు.. సొంత పైలెట్ అకాడమీ ఉన్నప్పటికీ సకాలంలో పైలెట్లను ఇండిగో సంస్థ నియమించుకోలేదు. ఇండిగో సంస్థలో గంగువాల్ కుటుంబం తమ వాటాలను నిరంతరం విక్రయించుకునే పనిలో పడింది. అందులో వాటాలను పశ్చిమ దేశాలకు చెందిన బ్యాంకులు కొనుగోలు చేశాయి. అందువల్లే ఇటీవల విమానాలను తెలివిగా నిలిపివేశాయి. ప్రభుత్వం పైలెట్ల విశ్రాంతి సమయాన్ని.. రాత్రి కాలంలో ఆపరేషన్ల నియమాలను అత్యంత కఠిన తరం చేసింది. దీంతో రోజుకు 2300 విమానాలను నడిపే ఇండిగో సంస్థ మీద విపరీతమైన ఒత్తిడి పడింది. పైలెట్లు విమానాలు నడపడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ.. కంపెనీ కావాలనే విమానాలను నిలిపివేసిందని తెలుస్తోంది. పలువురు పైలెట్లు విజిల్ బ్లోయర్లుగా ముందుకు వచ్చి ఈ నిజాలను వెల్లడించారు.

## ముంబై స్థాయిలో హైదరాబాద్

### నాలుగు కార్పొరేషన్లు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరిస్తూ, పరిధిలోని 27 పెరిఫెరల్ అర్బన్ లోకల్ బాడీలను విలీనం చేషశారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రేటర్ వార్డుల సంఖ్యను 150 నుండి 300 కు పెంచుతూ అధికారిక ఉత్తర్వులు (ఊా) జారీ చేసింది. పట్టణ పాలనను మరింత బలోపేతం చేయడంలో భాగంగా, ఈ విస్తరణకు అనుగుణంగా వార్డుల సంఖ్యను రెట్టింపు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు ఉన్న 150 వార్డుల స్థానంలో ఇకపై 300 వార్డులు ఉంటాయి. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 27 పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేయడంతో ఈ మార్పు అనివార్యమైంది. విస్తరించిన హైదరాబాద్ పరిధిని తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణిస్తున్నారు. వార్డుల సంఖ్య పెంపు ద్వారా ప్రతి వార్డు పరిధి తగ్గి, కార్పొరేటర్లు ప్రజలకు మరింత చేరువగా ఉండటానికి, సమస్యలను త్వరగా పరిష్కరించడానికి వీలు కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇది మెరుగైన పౌర సేవలు , మౌలిక వసతుల కల్పనకు దోహదపడుతుంది. ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా వార్డుల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర అధ్యయనం చేయించారు. ఆ నివేదిక ఆధారంగానే ఈ పెంపునకు ఆమోదం లభించింది. అయితే ఇంత పెద్ద ప్రాంతానికి ఒకే మేయర్ ఉండటం కష్టమని తర్వాత డీసెంట్రలైజ్ చేసి మూడు లేదా నాలుగు కార్పొరేషన్లుగా విభజించే ప్రణాళికలు ఉన్నట్లుగా తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వంజారీ చేసిన జీవో ప్రకారం 300 వార్డులు, 300 ఎన్నికైన కార్పొరేటర్లు ఉంటారు. ఇది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టానికి అనుగుణంగా జరిగింది. ప్రస్తుతం గ్రేటర్ పరిధి 650 చ.కి.మీ.లు మాత్రమే ఉండగా, 27 మున్సిపాలిటీలు, 1 గ్రామ పంచాయతీలను కలిపిన తర్వాత ఇది 2,000 చ.కి.మీ.లకు చేరుకుంటుంది. జనాభా 1.3 కోట్లకు పైగా ఉ ండగా, ప్రతి వార్డులో 40,000-50,000 మందులు ఉంటారు. సర్కిల్స్ సంఖ్య 30 నుంచి 57కి పెరిగింది. ప్రతి మెర్జ్ అయిన మున్సిపాలిటీని ఒక సర్కిల్‌గా పరిగణిస్తారు. గ్రేటర్ విస్తరణ తర్వాత, దీనిని మూడు లేదా నాలుగు చిన్న కార్పొరేషన్లుగా విభజించే ప్రణాళికలు ఉన్నాయి. ఫలితంగా, ప్రస్తుత ఒక మేయర్ పదవి కాకుండా నాలుగు మేయర్ స్థానాలతో కార్పొరేషన్లు ఏర్పడే అవకాశం ఉంది. మూడు వందల మంది కార్పొరేటర్లతో అంటే పాలన కూడా గందరగోళంగా మారే అవకాశం ఉంటుంది. అందుకే నాలుగు కార్పొరేషన్లు చేసి..నలుగురు మేయర్లు బాధ్యతలు నిరవహించే అవకాశాలు ఉన్నాయి. వార్డుల సంఖ్య ఖరారు కావడంతో వార్డుల డీలిమిటేషన్ ప్రక్రియను ఉఊఓఅ త్వరలో చేపట్టనుంది. ఈ ప్రక్రియలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిపాలనా విభాగాలతో సమన్వయం చేసుకోనుంది. ప్రస్తుత ఉ ఊఓఅ కౌన్సిల్ టర్మ్ ఫిబ్రవరి 11, 2026కు ముగుస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశంఉంది. ఇప్పటికి అయితే 300 వార్డులతో ఎన్నికలు జరిగితే, కాంగ్రెస్, ఃఖీూ, ఃఏఖ, ంఎఓఎఎఓ మధ్య తీవ్ర పోటీ జరుగుతుంది.

## జాతీయ సంక్షోభాలపై పార్లమెంట్ లో చర్చ అవసరం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ




**పెద్దపలి,తెలంగాణ దిశ :** దేశం ప్రస్తుతం తీవ్ర అస్థిర పరిస్థితులను ఎదుర్కొంటున్న దని ప్రజలకు నేరుగా ప్రభావం చూపే అంశాలు పార్లమెంట్‌లో చర్చకు రాకపోవడం విచారకర మని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ డీజీసీఏ కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చిన రెండేళ్లు అవుతున్నా, ఇండిగో మాత్రం వాటిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రయాణికుల భద్రతకు సంబంధించిన ఈ అంశంపై చర్చ తప్పనిసరి కావాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, ఢిల్లీలో కాలుష్యం 500కి పైగా ఏక్యూఐ చేరి ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుండగా, దీనిపై కూడా ప్రభుత్వం మౌనం వహిస్తున్నద ని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ రూపాయి విలువ పడిపోవడం ఆందోళనకరమని, రూపాయి ఐసీయూ లో ఉన్నట్లుగా అనిపిస్తుందన్నారు. నిరుద్యో గం పెరిగిందని, మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చిన సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగాలు ఎక్కడ అంటూ ప్రశ్నించారు. పార్లమెంట్‌లో చర్చించాల్సిన అసలు సమస్యలను పక్కన పెట్టి, 150 సంవత్సరాల క్రితం అంశాలపై చర్చ జరగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఎంపీ సలహా ఇచ్చారు. ఏంపీ రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం ఇవ్వకుం డా దారి మళ్లించడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు. ఎన్నికల కమిషనర్ ఎంపికలో ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని, న్యాయవ్య వస్థపై గౌరవం ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. ఈ విషయాలను ప్రభుత్వం వ్యక్తిగతంగా కాకుండా దేశ ప్రయోజనంగా తీసుకొని చర్చకు రావాలని ఎంపీ వంశీకృష్ణ డిమాండ్ చేశారు.

## బోర్డర్ లో భారీ ప్రాజెక్టులు

శ్రీనగర్, : భారత్-పాక్ సరిహద్దు అంటేనే ఉద్రక్తతలకు నెలవు. పరిస్థితి ఎప్పుడు ఎలా ఉంటుందో ఎవరికీ తెలియదు. ఇలాంటి పరిస్థితిలో భారత్.. సరిహద్దు భద్రతను మరింత పరిష్టం చేసింది. భారత్ పాకిస్థాన్ సరిహద్దుకు అత్యంత సమీపంలో 125 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు పూర్తయి, వాటిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టుల్లో కీలకమైన రోడ్లు, మాడ్యులర్ వంతెనలు, సొరంగాలు ఉన్నాయి, వీటి విలువ సుమారు రూ.5వేల కోట్లు. వీటితో సైన్యం సరిహద్దుకు వేగంగా చేరుకునే అవకాశాలు మెరుగవుతాయి. స్థాపితమైన బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ గతంలో పెద్దగా పనులు చేయలేదు. తాజాగా 23 రోడ్లు, 93 వంతెనలు, 4 ఇతర ప్రాజెక్టులు సరిహద్దు రక్షణను బలపరిచే విధంగా రూపొంది ఉన్నాయి. రాజస్థాన్ నుంచి జమ్మూ కాశ్మీర్, లడ్డాక్, ఉ త్తరాఖండ్, అరుణాచల్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సరిహద్దులపై ఈ పనులు చేపట్టింది. హిమాలయ ప్రాంతాలలో కూడా ఇంజినీరింగ్ అద్భుతాలు చోటు చేసుకున్నాయి. లడ్డాక్ ప్రాంతంలో దౌలత్‌బేగ్ నుంచి 50 కిలోమీటర్ల రోడ్డు నిర్మించడం ఎంతో కీలకం. ఈ ప్రాజెక్టు సియాచిన్ పరిస్థితులను కాపాడేందుకు సంబంధించినది. 920 మీటర్ల పొడవైన సొరంగం కూడా నిర్మించబడింది, ఇది సైన్యానికి ఏకకాలంలో వేగంగా ప్రాథమిక స్థితికి చేరుకోవడంలో సహాయపడుతుంది. ఉత్తరాఖండ్ ఖుమాయు, నార్త్ సిక్కిం, మిజోరం వంటి క్లిష్ట ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేయడం ద్వారా కేవలం సైనికుల కోసం మాత్రమే కాకుండా, ప్రజలకు కూడా నిత్యావసర సదుపాయాలు అందించడం లక్ష్యంగా ఉంది. ప్రజలు సరిహద్దుకు సమీపంలోని ప్రాంతాల్లో నివసించడానికి వీలుగా మారిందిపాత కాలంలో అటువంటి రోడ్లు, వంతెనలు లేకపోవడం వల్ల భారత సైన్యం సరిహద్దుకు చేరుకోవడంలో జాప్యం అయ్యేది. గత యుద్ధాలలో నష్టాలకు కారణమైంది. ఈ కొత్త నిర్మాణాలు సైన్యం వేగంగా కదలడానికి దోహదపడతాయి. తద్వారా భద్రతా పరిస్థితులను బలోపేతం చేస్తాయి. సంస్థాగత, వ్యూహాత్మకమైన అభివృద్ధులు భారత్ సరిహద్దు భద్రతలో కీలక పాత్ర పోషించనున్నాయి. భవిష్యత్తులో ఇదే విధంగా ఇతర సరిహద్దు ప్రాంతాల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కొనసాగుతుంది.

# పడకేసిన రియల్ ఎస్టేట్..



**అమరావతి,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలతో అమరావతి ప్రాంత రైతులకు సంబంధిం చిన భూముల విలువ ఢమాల్ అని పడిపోయింది. 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత అమరావతి రాజధానిగా ప్రకటించిన సమయంలో రాజధాని ప్రాంతంలో ఎకరం భూమి నలభై లక్ష రూపాయలు చేసే భూమి ఒక్కసారిగా ఎనభై లక్షల రూపాయల వరకూ పలికింది. రాజధాని ఇక్కడకు వస్తుందని తెలిసి అనేక మంది కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో రాజధాని ప్రాంతమే కాకుండా గుంటూరు జిల్లాలోని భూములకు కూడా ఒక్కసారి ధరలు పెరిగాయి. అక్కడకు కార్లలో అధిక సంఖ్యలో రియల్ వ్యాపారులు వచ్చి భూములుబేరాలు ఆడి కొనేవారు. కానీ నేడు బేరమాడే వారు కూడా లేరు.అయితే 2019 ఎన్నికలలో జగన్ వచ్చి మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చిన వెంటనే తిరిగి ఎకరం భూమి నలభై లక్షల రూపాయలకు చేరింది.దీంతో ఈ ప్రాంత వాసులు ముఖ్యమంత్రిగా చంద్రబాబు తిరిగి ఎన్నికయ్యేందుకు దోహదపడ్డారు. వారి ఆందోళనలు ఒకరకంగా పార్టీకి అనుకూలంగా మారాయి. అయితే చంద్రబాబు వచ్చిన తర్వాత అనుసరిస్తున్న పద్ధతులు, వరసగా భూ సమీకరణలు చేస్తుండటంతో మళ్లీ రియల్ ఎస్టేట్ స్తబ్దత నెలకొనిందంటున్నారు. గతంలో హైదరాబాద్ నుంచి వచ్చిన కొందరు రియల్ వ్యాపారులు ఇక్కడకు వచ్చి భూములు కొనుగోలు చేసి వెంచర్లను ఏర్పాటు చేశారు. కొందరు అపార్ట్ మెంట్లు నిర్మించారు. నేడు అపార్ట్ మెంట్ల ధరలు కూడా గతంలో మాదిరిగా లేవంటున్నారు. గతంలో అమరావతి రాజధాని హైప్ చూసి భూమిని కొనుగోలు చేసిన వారు ఇప్పుడు అమ్మాలన్నా కొనేవారు లేరని వాపోతు న్నారు.అమరావతిలో తొలి విడత ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చిన భూ ములుఇంత వరకూ అభివృద్ధి చేయకుండా రెండో విడత భూ సమీక రణకు ప్రభుత్వం వెళ్లడం, మూడో విడత కూడా ఉందనిచెప్ప డంతో భూముల ధరలు ఢమాల్ అంటున్నాయట. ఇందుకు అమరావ తికిచెందిన ఒక రైతుఉదాహరణ చెప్పారు.ఎక్కడైనా ఒక వీధిలో ఒక షాపు ఉంటే దానికి గిరాకీ ఉంటుంది.అదే వీధిలో మరొక షాపు ఏర్పాటయితే గిరాకీ తగ్గిపోతుంది. ఇప్పుడు రెండోసారి భూ సమీకరణ విషయంలో తాము కూడా ఇలాగే అన్యాయానికి గురవుతున్నామని చెబుతున్నారు. తాము రాజధానికి వ్యతిరేకం కాదంటూనే తమకు ప్లాట్లను అభివృద్ఇ చేయకుండానే మరొకరికి ప్లాట్లు కేటాయించడంతో భూముల ధరలు తగ్గిపోయాయని, జేఏసీ నేతలతో మాట్లాడి ఫలితం లేదని, గ్రామ సభలు జరిపి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించాలి కదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

# భారత్‌పై మరో దేశం 50 శాతం సుంకాలు..

## వాణిజ్య యుద్ధానికి దిగిన మెక్సికో భారతీయ వస్తువులపై 50% టారిఫ్



న్యూఢిల్లీ: భారతీయ దిగుమతులపై అమెరికా 50 శాతం దిగుమతి సుంకాలు విధించిన నేపథ్యంలో భారత్‌కు మరో దేశం నుంచి కూడా పన్ను పోటు ఎదురైంది. భారత్ నుంచి దిగుమతి అయ్యే అనేక వస్తువులపై 50 శాతం సుంకాలు విధించేందుకు మెక్సికో సెనేట్ బుధవారం ఆమోదించింది. భారత్‌తోపాటు చైనా, మరికొన్ని ఆసియన్ దేశాలపై కూడా దీని ప్రభావం ఉండనున్నది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సంతుష్టి పరిచేందుకే మెక్సికో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాయిటర్స్ అభిప్రాయపడింది. 2026 జనవరి నుంచి అమల్లోకి రానున్న సుంకాల పెంపు నిర్ణయంతో ఆటోలు, ఆటో విడిభాగాలు, జౌళి, ప్లాస్టిక్స్, ఉక్కు వంటి వస్తువులపై 50 శాతం దిగుమతి సుంకం పడనున్నది. మెక్సికోతో వాణిజ్య ఒప్పందం లేని దేశాలపై దిగుమతి సుంకాన్ని 50 శాతం విధించాల ని మెక్సికో సెనేట్ తీర్మానించింది. దీని వల్ల భారత్, దక్షిణ కొరియా, చైనా, థాయ్‌లాండ్, ఇండోనేషియా నష్టపోనున్నాయి.

వచ్చేఏడాది అదనంగా రూ.376 కోట్ల డాలర్లు (దాదాపు రూ. 33, 940 కోట్లు) అదనపు ఆదాయాన్ని ఆర్జించాలని మెక్సికో భావిస్తోంది. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ నిర్ణయించుకున్న సమయంలోనే ఈ పరిణామం చోటుచేసు కుంది. అయితే అమెరికా-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందంపై అమెరికాలో సమీక్ష జరగనున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ప్రసన్నం చేసుకునేందుకే మెక్సికో ఈ చర్యను చేపట్టినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మెక్సికో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అమెరికా ప్రస్తుతం ఉంది.

ఈ ఏడాది ప్రారంభంలో చైనీస్ వస్తువులపై మెక్సికో భారీగా సుంకాలు విధించింది. అయినప్పటికీ ట్రంప్ మాత్రం షేన్‌బామ్ ప్రభుత్వంపై గత కొన్ని నెలలుగా తీవ్ర ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు. మెక్సికన్ స్టీల్, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించిన ట్రంప్ పియోయిడ్ ఫెంటానిల్(మత్తు పదార్థం) ప్రవాహాన్ని అడ్డుకోవడంలో విఫలమైనందుకు అదనంగా మరో 25 శాతం సుంకాలు విధిస్తామని మెక్సికోను బెదిరించారు.

అంతేగాక అమెరికన్ రైతులకు సాగునీరును అందించే 1944 నాటి ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు మెక్సికోపై మరో 5 శాతం సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

భారత్‌పై మెక్సికో ప్రభావం:

భారతీయ దిగుమతులపై 50 శాతం సుంకాలు విధించాలన్న మెక్సికో నిర్ణయం ఉభయ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నది. 2024లో భారతీయ దిగుమతులు అత్యధికంగా 1,170కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. మెక్సికన్ ఎగుమతులకు భారత్ 9వగమ్యస్థానంగా ఉంది. ప్రస్తుతం మెక్సికో నుంచి దిగుమతి చేసు కుంటున్న వస్తువుల కన్నా భారత్ నుంచి ఎగుమతి అవుతున్న వస్తు వులేఅధికంగా ఉన్నాయి. ఉదాహరణకు 2024లోమెక్సికోకు భారతీ య ఎగుమతుల విలువ 890కోట్ల డాలర్లు ఉండగా దిగుమ తుల విలువ280 కోట్ల డాలర్లు మాత్రమే ఉంది. భారత్‌కు అనుకూ లంగా వాణిజ్య వ్యత్యాసం ఉంది. 2024లో భారత్ నుంచి ప్రధానం గా మోటారు కార్లు, ఆటో విడిభాగాలు, ఇతర ప్యాసింజర్ వాహనాలను మెక్సికోదిగుమతి చేసుకుంది. ఈ వస్తువులపై మెక్సికో ఇప్పుడు భారీగా సుంకాలు విధించడంతో వచ్చే ఏడాది ఈ వస్తువుల దిగుమతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

# రాజ్యసభ కోసం పెద్ద పోటీ

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఏపీలో వచ్చే ఏడాది మే-జూన్ నెలల మధ్య జరగనున్న రాజ్యసభ ఎన్నికలు రాజకీయ వర్గాల్లో ఇప్పటికే చర్చకు దారితీశాయి. ఈసారి నాలుగు స్థానాలు ఖాళీ కానుండగా, ప్రస్తుత పరిస్థితుల రీత్యా ఈ నాలుగింటినీ టీడీపీ కూటమి గెలుచుకునే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి మొత్తం 11 మంది రాజ్యసభ సభ్యులు ఉ న్నారు. అందులో ఇద్దరు టీడీపీ, ఇద్దరు బీజేపీ , మిగిలిన ఏడుగురు వైఎస్సార్‌సీపీకి చెందినవారు.వచ్చే జూన్ 21తో వైసీపీ నాయకులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని పదవీకాలం ముగుస్తుంది. అలాగే గత ఏడాది జరిగిన ఉపఎన్నికలలో టీడీపీ తరఫున గెలిచిన సానా సతీష్ పదవీకాలం కూడా అదే తేదీన పూర్తవుతుంది. ఈ కారణంగా ఎన్నికలు జూన్‌కు ముందే జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలు టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి ఉ ండటంతో నాలుగు స్థానాల పంపకం ఎలా జరుగుతుందన్న ప్రశ్న మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటి వరకు జరిగిన రెండు ఉ పఎన్నికల్లో టీడీపీ, బీజేపీ చెరో రెండు సీట్లు పొందగా, జనసేనకు ఇంకా అవకాశం రాలేదు. దీంతో ఈసారి జనసేనకు ఒక సీటు కేటాయించే అవకాశంపై చర్చ ఎక్కువైంది. గతంలో నాగబాబు కు అవకాశం వస్తుందని అనుకున్నా, బీజేపీ ఆ సమయంలో ఒత్తిడి తీసుకోవడంతో జనసేన వెనక్కి తగ్గాల్సి వచ్చింది. కాబట్టి ఈసారి బీజేపీ బదులుగా జనసేనకు అవకాశం ఇస్తారా అనేది ప్రధాన చర్చాంశంగా మారింది.టీడీపీకి వచ్చిన సీట్లపై కూడా పార్టీ లోపలే పెద్ద పోటీ కనిపిస్తోంది. కేవలం ఏడాదిన్నరలోనే పదవీకాలం ముగిసే సానా సతీష్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆయన లోకేశ్ కు అత్యంత సన్నిహితుడు కావడం, ఢిల్లీలోని కేంద్ర నాయకత్వం వద్ద మంచి పరిచయాలు ఉండటం ఈ అవకాశాలను పెంచుతున్నాయని అంటున్నారు. గతంలో ఈ బాధ్యతలను నిర్వర్తించిన కంభంపాటి రామ్మోహనరావు కూడా ఈసారి రాజ్యసభకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారముంది.ఇక టీడీపీకి చెందిన గల్లా జయదేవ్ ,పొత్తుల్లో భాగంగా సీట్లు కోల్పోయిన దేవినేని ఉమా, పిఠాపురం వర్మ ,జవహర్తో పాటు సీనియర్ నాయకులు వర్ల రామయ్య , యనమల రామకృష్ణుడు వంటి పలువురు నేతలు కూడా రాజ్యసభ టికెట్ కోసం ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోసం సీటు వదులు కున్న పిఠాపురం వర్మకు పార్టీ ఏదైనా ప్రత్యామ్నాయం ఇవ్వాలని డిమాండ్ పెరుగుతోంది.అయితే, ఆశావహులలో ఎక్కువ మంది అగ్రవర్ణాలకు చెందినవారే ఉండటంతో, ఈసారి సామాజిక సమతు ల్యాన్ని దృష్టిలో ఉంచి బీసీ, ఎస్సీ వర్గాలకూ అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో రాబోయే రాజ్యసభ ఎన్నికలు టీడీపీ కూటమిలో భారీ ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.

## రైల్వే కూలీలకు సామాజిక భద్రత ఇవ్వండి

**రైల్వే కూలీల సమస్యలు పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**

**నంద్యాల,తెలంగాణ దిశ :**భారతదేశ వ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో పనిచేసే కూలీల సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని గురువారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లారు.లోక్ సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ పోర్టర్ల జీవనోపాధిని కాపాడాలని, దేశంలోని అన్ని రైల్వే స్టేషన్లలలో పోర్టర్ జీవనోపాధి (కూలీలు )అని కూడా పిలుస్తారని, ఈ రైల్వే కూలీలు దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో పనిచేస్తున్నారని అన్నారు. బ్యాటరీతో నడిచే వాహనాలు, బస్సు సేవలను కూడా అవుట్ సోర్స్ చేస్తున్నామని దీంతో రైల్వే కూలీల(పోర్టర్) ఆదాయం పడిపోయిందని, కూలీల ఆదాయం కూడా తగ్గడంతో రైల్వే కూలీల కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి వెళ్ళాయని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పార్లమెంట్ దృష్టికి తెచ్చారు.రైల్వే బోర్డు 2008లో ఇలాంటి సంక్షోభాన్ని పరిష్కరించిం దని, ఇక్కడ ఒక ప్రత్యేక విధానాన్ని రూపొందించారని, ఈ పోర్టర్లను రైల్వేలలో ఉంచారు. కాబట్టి నేను అభ్యర్థిస్తున్నాను.

# 37 మందిలో మార్పు కనిపించడం లేదా..?

**గుంటూరు,తెలంగాణ దిశ :**తెలుగుదేశం పార్టీకి చెందిన 37 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగాలేదని పార్టీ అధినేత చంద్రబాబుకు నివేదిక అందిం ది. బ్యాక్ ఎండ్ టీం ఇచ్చిన నివేదిక మేరకు రాష్ట్రంలో 37 మంది ఎమ్మెల్యేల పనితీరు ఇప్పటి వరకూ ఏమాత్రం మెరుగుపడలేదని నివేదిక ఇచ్చింది. అయితే ఇది వారికి ఫైనల్ కాల్ అని ముఖ్యమ ంత్రిచంద్రబాబు నాయుడు చెప్పినట్లు తెలిసింది. కొన్నాళ్లుగా అం దుతున్న నివేదికలను అనుసరించి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేల పనితీరును మెరుగుపర్చుకోవాలని పదే పదే చెబుతున్నారు. ప్రజల్లోనే ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెబుతున్నారు. అయినా పెద్దగా ఎమ్మెల్యేలు లెక్కచేయని పరిస్థితి ఉందని ఈ లెక్కలు చెబుతున్నాయి.ప్రతి నెల సాక్షాత్తూ చంద్రబా బుతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు పింఛను పంపిణీ కార్యక్రమా ల్లో పాల్గొనాలని చెప్పినప్పటికీ కొందరు ఎమ్మెల్యేలు దూరంగా ఉంటున్నారు. అలాగే సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలను కూడా స్వయంగా ఎమ్మెల్యేలు చేయాలని చెప్పినా లైట్ తీసుకుంటున్నారు. అనేకసార్లు చంద్రబాబు వారికి క్లాస్ లు పీకారు. అయితే గుంపులో గోవిందా అన్నట్లుగా వారు తమను కాదులే అన్న ధోరణిలో వ్యవహ రిస్తున్నారని చంద్రబాబు కూడా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసి ంది. కూటమి ప్రభుత్వం అధికారంలో కి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఎమ్మెల్యేల పనితీరును మెరుగుపర్చు కోకపోవడం పై ఒక వరసగా వన్ టూ వన్ సమావేశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.త్వరలోనే ఒక్కొక్క ఎమ్మెల్యేను పిలిచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా వారితో మాట్లాడేందుకు సిద్ధం చేయాలని పార్టీ నేతలకు ఆదేశించినట్లు తెలిసింది. 37 మంది పనితీరు బాగాలేదంటే చిన్న విషయం కాదు. చిన్న అంకె కూడా కాదు. వారి వల్ల భవిష్యత్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటుపై పడే అవకాశం కూడా ఉందని భావించిన చంద్రబాబునాయుడు ఇది ఫైనల్ కాల్ అని, అప్పటికీ వారు పనితీరు మార్చుకోకపోతే, వచ్చే ఎన్నికల్లో వారిని తప్పించి మరొకరిని అభ్యర్థిగా ఎంపిక చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అందుకే చివరి హెచ్చరికలతోనైనా వారు తమ వ్యాపారాలను, ఇతర వ్యవహారాలను పక్కన పెట్టి నియోజకవర్గాల్లోనే ఉండి ప్రజా సేవ చేయాలని చంద్రబాబు గట్టిగా క్లాస్ పీకుతారంటున్నారు. అప్పటికైనా మారతారా లేదా అన్నది చూడాలి.

మంత్రులకు క్లాస్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి మంత్రుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈరోజు జరిగిన హెచ్ఓడీల సమావేశంలో మంత్రుల పనితీరును ఆయన తప్పుపట్టారు. మరోసారి మంత్రులపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేయడంతో ఇప్పుడు అందరిలోనూ చర్చనీయాంశంగా మారింది. మంత్రుల పనితీరులో ఎలాంటి మార్పు రాలేదని చంద్ర బాబు అన్నారుచాలా మందికి తమ శాఖల్లో ఏం జరుగుతుందో తెలియడంలేదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తేవడం, వినియోగించడంలో విఫలమయ్యారంటూ అసహనం వ్యక్తం చేశారు. మంత్రులు ఒక్కరోజు ఢిల్లీకి వెళ్లడంలో నష్టం లేదన్న చంద్రబాబుర ఇకనైనా మంత్రులు పనితీరు మార్చుకోవాలని, ఫైళ్ల క్లియరెన్స్ లోనూ వేగంగా స్పందించాలని చంద్రబాబు ఆదేశించారు.

# రెంటికి చెడ్డ రేవడిలా మమత..?

పశ్చిమ బెంగాల్‌లో తిరుగులేని నేతగా ఎదిగారు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ. కమ్యూనిస్టుల కంచుకో టను 15 ఏళ్లక్రితం బద్దలు కొట్టి అధికారం చేపట్టారు. వరుసగా మూడుసార్లు ఎన్నికయ్యారు.. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఇటీవలే జరిగినట్లు అనిపిస్తోంది. వెస్ట్ బెంగాల్ శాసన సభకు ఎన్నికలు జరిగి దాదాపు ఐదేండ్లు గడిచిపోయాయి. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్ శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. 2026 పశ్చిమ బెంగాల్ స్టేట్ ఎన్నికలు హోరాహోరీగా చాలా పెద్ద పోరాటాన్ని తలపించే విగా ఉంటాయి.గొప్ప ఫ్రెంచ్ రచయిత జీన్ అల్ఫోన్స్ కర్ ఇలా అన్నారు.. 'కొన్ని విషయాలు ఎంతగా మారినా మరికొన్ని విష యాలు అంతకంటే ఎక్కువగా యథాతథంగా అలాగే ఉంటాయి'. ఇది వెస్ట్ బెంగాల్ రాజకీయాలకు పూర్తిగా వర్తిస్తుంది. 2000 నుంచి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, బీజేపీ అధ్యక్షుడు సువేందు అధికారి, అదే కాంగ్రెస్ నాయకులు, అదే కమ్యూనిస్ట్ నాయకులు బెంగాల్ రాజకీయాల్లో కొనసాగుతున్నారు. తృ ణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ 2011 నుంచి పశ్చిమబెంగాల్ ముఖ్యమ ంత్రిగా కొనసాగుతున్నారు. 1977 నుంచి ఏకధాటిగా పశ్చిమ బెంగాల్ ను పాలిస్తున్న వామపక్ష ప్రభుత్వాన్ని మమతా బెనర్జీ అనూహ్యంగా ఓడించారు. ఇది ఒక సూపర్ హ్యూమన్ టాస్క్. తృణ మూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ కాంగ్రెస్ పార్టీని కూడా వెస్ట్ బెంగాల్ లో పూర్తిగా నాశనం చేసింది. 2021లో జరిగిన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు గెలవకుండా మమతా బెనర్జీ అడ్డుకోగలిగారు. ఆమెకు ఎదురు నిలిచిన రాజకీయ శత్రువులు మొత్తం కనుమరుగై పోయారని మమతా బెనర్జీ భావిస్తున్న తరుణంలో.. అకస్మాత్తుగా వెస్ట్ బెంగాల్ లో బీజేపీ ఒక బలమైన రాజకీయ శక్తిగా మారింది. ఇప్పుడు బీజేపీ పశ్చిమ బెంగాల్‌లో ప్రధాన ప్రతిపక్షంగా మారింది. . అయితే ప్రతీ ఎన్నికల్లో మమతాబెనర్జీ పార్టీకి బెంగాల్‌లోని ముస్లింలు అండగా నిలిచారు. దీంతో మమతా కూడా సహజంగానే ఇంతకాలం వారికి అనుకూలంగా వ్యవహరించారు. అయితే ముస్లింలో మెజారిటీ ప్రజలు బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వలస వచ్చినవారే. అయినా వారిని మమతా పెంచి పోషించారు. అయితే తాజాగా ముర్షిదాబాద్‌లో తృణమూల్ ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్ బాబ్రీ మసీదు నిర్మాణానికి ముందుకొచ్చి పార్టీకి సవాలు విసిరాడు. స్థానికులు భారీగా విరాళాలు, సామగ్రి సమర్పించడంతో విషయం విస్తరించింది. మమతా బెనర్జీ వెంటనే ఆయన్ను పార్టీ నుంచి తొలగించి డామేజ్ కంట్రోల్ చేస్తూ తీవ్ర చర్య తీసుకున్నారు. దీంతో హిందువుల్లో సానుభూతి పెరిగింది. బాబ్రీ కూల్చివేతకు వ్యతిరేకంగా ముస్లిం సమాజం నిరసనలకు మమతాబెనర్జీ అనుమతి ఇచ్చారు. ఇది వ్యూహాన్ని సంక్లిష్టం చేసింది. ఒకవైపు మసీదు నిర్మాణాన్ని అడ్డుకుని హిందువులకు అనుకూలంగా వ్యవరించి.. మైనారిటీలకు వ్యతిరేకమయ్యారు. ఇదే సమయంలో బాబ్రీ కూల్చివేత వ్యతిరేక ర్యాలీకి అనుమతి ఇచ్చి.. హిందువుల్లో ఉన్న సానుభూతి పోగొట్టుకున్నారు.ఎంఐఎంతోపాటు బెంగ్లాలోని మతగురువుల మద్దతులో ఎంఐఎం వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తే ముస్లిం ఓట్లు విభజనకు దారితీస్తాయని మమతా ఆందోళన చెందుతున్నారు. తాను పెంచిన నేతలు మతోన్మాద రూపం తీసుకుంటే పార్టీ ఆధిపత్యం దెబ్బతింటుంది. వచ్చే ఎన్నికల్లో ఈ సంఘటనలు ప్రభావం చూపి కూటమి అధికారాన్ని బెంగాల్‌లో ఇబ్బంది పెట్టవచ్చు.మమతా బెనర్జీ పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడిన ఎలక చందంగా మారింది. పార్టీ అంతర్గత ఘర్షణలు, మత రాజకీయాల సంక్లిష్టతను తెలియజేస్తోంది. మైనారిటీ మద్దతును కాపాడుకుంటూ మెజారిటీ సానుభూతిని కోల్పోకుండా సమతుల్యత అవసరం. ఈ వివాదం తృణమూల్ భవిష్యత్ వ్యూహాలను పునఃపరిశీలిం చేలా చేస్తుంది.2021లో బీజేపీతో జరిగిన తీవ్ర పోరాటం తర్వాత మమతా బెనర్జీ బెంగాల్ ఎన్నికలలో విజయం సాధించి ముఖ్యమంత్రి పదవిని అధిష్టించారు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో నాలుగు ప్రాథమిక రాజకీయశక్తులు ఉన్నాయి. అవి మమతా బెనర్జీ సారథ్యంలోని తృణ మూల్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, లెఫ్ట్ ఫ్రంట్. పశ్చిమ బెంగాల్ లో కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టుల లెఫ్ట్ ఫ్రంట్ లకు కచ్చితమైన చిన్న ఓటు బ్యాంకులు ఉన్నాయి.

బెంగాల్‌లో బీజేపీ వేగంగా అభివృద్ధి చెందడం ప్రారంభించింది. 2021 రాష్ట్ర ఎన్నికలలో బీజేపీ 296 మంది ఎమ్మెల్యే స్థానాల్లో 77 మంది



ఎమ్మెల్యేలను గెలుచుకుంది, ఇది బీజేపీకి భారీ లాభం. బీజేపీ గెలుపు కోసం కష్టపడి పనిచేస్తోంది. బహుశా బీజేపీ 2021 కంటే ఎక్కువ ఎమ్మెల్యేలను గెలుచుకునే అవకాశం ఉంది. కానీ 28% ముస్లిం జనాభా ఉన్నందున బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకోవడం కష్టం. పశ్చిమ బెంగాల్‌లో నరేంద్ర మోదీ ప్రజాదరణ గణనీయంగా పెరిగింది. తమ రాష్ట్రం అక్రమ వలసదారులతో నిండిపోయిందని బెంగాలీ హిందు వులు ఆందోళన చెందుతున్నారు. బెంగాలీలు కూడా తమ సంస్కృతిని మార్చుకోవాలని, పరిశ్రమలను స్వాగతించాలని తెలుసు.

బెంగాలీలలో మార్పు నెమ్మదిగా వస్తోంది. కానీ,చారిత్రాత్మకంగా బెంగాల్ కూడా కొత్త ఆలోచనలకు తెరతీసింది. బీజేపీ వంటి జాతీయ పార్టీకి ఓటు వేయాలా వద్దా అని బెంగాలీలు నిశ్శబ్దంగా అంచనా వేస్తున్నారని చెప్పవచ్చు. అస్సాంలోలాగ బెంగాల్ రాజకీయాలను విదేశీయులు నిశ్శబ్దంగా నియంత్రిస్తున్నారనే ఆందోళన కూడా ఉ ంది. పశ్చిమ బెంగాల్‌లోనూ మార్పు రావొచ్చు, కానీ.. నెమ్మదిగా!వెస్ట్ బెంగాల్‌లో దాదాపు 28% జనాభా కలిగిన మైనారిటీ ఓటుబ్యాంకు ఉంది. ఒకప్పుడు ఈ మైనారిటీ ఓటు బ్యాంకు కాంగ్రెస్, కమ్యూనిస్టులకు అండగా వెన్నుదన్నుగా ఉండేది. కానీ ఇప్పుడు, ముస్లిం ఓటర్లు మమతా బెనర్జీ పార్టీ తృణమూల్ కాంగ్రెస్ వైపు మారారు. ఎందుకంటే ముస్లిం మైనారిటీ ఓటర్లు ఆమెను బీజేపీని ఓడించగల రాజకీయ శక్తిగా చూస్తున్నారు.

# ఒకే చోట రెండు వైన్ షాపులు

## స్థానికుల మండిపాటు

సికింద్రాబాద్ : ఒకే చోట రెండు మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి తమ రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహిళలు ధర్నా చేపట్టారు. మద్యం దుకాణాల ముందు నిలబడి ఎక్సైజ్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బేగంపేట్ లో శ్యామ్ లాల్ బిల్డింగ్ సమీపంలో ఏర్పాటు చేసిన దుకాణాలకు వ్యతిరేకంగా శ్యామ్ లాల్ బిల్డింగ్ వెల్ఫేర్ అసోసియేషన్, విజయ్ గణపతి టెంపుల్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ 7కాలనీలకు వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారి ఇది అని ఈ రహదారి ప్రారంభంలోనే ఇరు వైపులా రెండు మద్యం దుకాణాలను ఏర్పాటు చేసి స్వాగతం పలుకుతున్నట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి కనీసం పార్కింగ్ స్థలం కూడా లేదని ఐనా అనుమతులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. మద్యం దుకాణానికి అనుమతి ఇచ్చిన అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. బస్ స్టాప్ కు వెళ్లాలన్నా, బస్ స్టాప్ నుండి ఇళ్లకు వెళ్లాలన్న మహిళలు, పిల్లలు, పెద్దలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం కోసం శాంతి యుతంగా ఈ కార్యక్రమం చేయడం జరిగిందని, అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకొని మద్యం దుకాణాలను తొలగించాల ని డిమాండ్ చేశారు. లేకుండా మరింత ఉధృతంగా ఉద్యమాన్ని చెప్పాట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

# గోనె సంచెలు ఏవీ



**గుంటూరు,తెలంగాణ దిశ :** పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తన శాఖలో జరిగే విషయాలను పట్టించుకోవడం లేదు. రైతులు గిట్టుబాటు ధర రాకపోవడంతో పాటు గోనెసంచీలు లేక అవస్థలు పడుతున్నారు. వరికి గిట్టుబాటు ధర లభించడం లేదని వాపోతు న్నారు. గత ప్రభుత్వం పై విమర్శలు చేయడం మాని నాదెండ్ల మనోహర్ రైతుల గోడును పట్టించుకోవాలని కోరుతున్నారు. దిగుబడి తగ్గడమే కాకుండా, ఖర్చు ఎక్కువయి.. గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు అమ్ముకోవడానికి నానా అవస్థలు పడుతు న్నారు. వరికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎకరాకు నలభై నుంచి యాభై బస్తాలు పండాల్సిన వరి, ఈ ఏడాది ఇరవై నుంచి ఇరవై ఐదు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. టోకెన్లు ఇంత వరకూ జారీ కాకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. తేమ ఎక్కువగా ఉందని అధికారులు కొనుగోలుకు తిరస్కరిస్తున్నారు. గోనె సంచిలు కూడా తమకు అందడం లేదని రైతులు చెబుతున్నారు. 48 గంటల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని హామీ ఇచ్చినప్పటికి ఇప్పటి వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవలేదు. దీంతో కొందరు రైతులు రోడ్లపైనే ధాన్యం ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిల్లర్లు సిండికేట్ అయి రైతులను దోచుకుంటున్నారని అన్నదాతలు ఆవేశంగా చెబుతున్నారు. గ్రౌండ్ లెవెల్ లో ఈ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ 16శాతంఉంటేనే కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు షరతులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కృష్ణా జిల్లాలోనే ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గత ఏడాది 2,500నుంచి 2,700 క్వింటాల్ కు పలికిన ధరఈ ఏడాది పదిహేను వందల నుంచి పదిహేడు వందల రూపాయలకు పడిపోయిందని రైతులు చెబుతున్నారు. దాచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మొంథా, దిత్వా తుపాను దెబ్బకు తీవ్రంగా నష్టపోయిన రైతులు, ఎకరాకుపదివేలరూపాయల వరకూ నష్టపోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. అప్పులు ఇచ్చిన వాళ్లు తమ మీద పడి వడ్డీతో పాటు కట్టాలని హుకుం జారీ చేస్తున్నారన్నారు. నాదెండ్ల మనోహర్ ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైతులను దళారులను దోచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పెమ్మసాని కొత్త రికార్డ్



**గుంటూరు,తెలంగాణ దిశ :** మోడీ 3.0 ప్రభుత్వంలోని కొత్త మంత్రుల్లో ఆస్తుల పరంగా అతి ధనవంతుడిగా నిలిచిన వ్యక్తి గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ అనే సంగతి తెలిసిందే. ఆయన వెల్లడించిన రూ.5,705 కోట్ల ఆస్తులు అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమ య్యాయి. ప్రస్తుతం గ్రామీణాభివృద్ధి మరియు సమాచార శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న పెమ్మసాని మరో విశిష్ట రికార్డు సొంతం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన 25 మంది ఎంపీల పనితీరును పరిశీలించిన ఒక తాజా సర్వేలో పె మ్మసాని 8.9 స్కోర్ సాధించి మొదటి స్థానంలో నిలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కొత్తగా ఎన్నికైన ఎంపీగా, తొలి పదవీకాలంలోనే కేంద్ర మంత్రిగా ఉన్న వ్యక్తి ఇంత మంచి పనితీరు ప్రదర్శించడం ఆశ్చర్యంగా భావిస్తున్నారు. బుర్రిపాలెం లో జన్మించిన పెమ్మసాని ఉస్మానియా యూనివర్సిటీ లో వైద్య విద్య పూర్తిచేసుకుని అమెరికాకు వెళ్లారు. అక్కడ 'యూ వరల్డ్' అనే అంతర్జాతీయ స్థాయి వైద్య విద్యా సంస్థను స్థాపించి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది విద్యార్థులకు మార్గదర్శకుడయ్యారు. 2024 సాధారణ ఎన్నికల సమయంలో అమెరికాలోని స్థిరమైన కెరీర్‌ను విడిచి భారత రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఆయన ధైర్యసాహసాలకు నిదర్శనం. గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన 3,44,695 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించి కొత్త రికార్డు సృష్టించారు. రాజకీయాల్లో కొత్త అయినప్పటికీ ప్రజల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, పార్లమెంటరీ బాధ్యతలు ఇవన్నిట్లోనూ ఆయన చూపుతున్న నిబద్ధతే ఈ రికార్డు సాధించే కారణమని విశ్లేషకుల అభిప్రాయం. ఇక అమరావతి రాజధాని ప్రాంతం గుంటూరు ఎంపీ పరిధిలో ఉండటం వల్ల అక్కడి రైతులకు బలమైన మద్దతు అవసరం. ఈ నేపథ్యంలో పెమ్మసాని తరచూ స్థానిక రైతులతో సమావేశమై, వారి సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నారు. తనప్రాంత ప్రజల పట్ల ఎలాంటి రాజకీయ స్వార్థం లేకుండా వ్యవహరించడం ఆయనకు మంచి గుర్తింపు తెచ్చింది. అదనంగా, పార్లమెంట్ తొలి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంపీలు మొత్తం1,576 ప్రశ్నలను లేవనెత్తగా, అందులో 1,081 ప్రశ్నలు టీడీపీఎంపీల నుంచే రావడం గమనార్హం. సగటున ప్రతి టీడీపీ ఎంపీ 77.2 ప్రశ్నలు అడగడం, జాతీయ సగటు 46.8 కంటే చాలా ఎక్కువ. ఈ సంఖ్యలు తమ పనితీరుతో టీడీపీ ఎంపీలు ఎంత చురుకుగా ఉన్నారనే విషయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ సమష్టి కృషిలో పెమ్మసాని చంద్రశేఖర్ ముందంజలో నిలవడం సహజమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాసేవను రాజకీయాల కంటే ముందుగా పెట్టే నాయకత్వం ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టిందనే విషయం ఇప్పుడు మరింత స్పష్టమవుతోంది.


# ఇంకా పదవెప్పుడు..

**విజయవాడ,తెలంగాణ దిశ :** మెగా బ్రదర్ నాగబాబుకి మంత్రి పదవి ఇస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించి ఏడాది అయింది. పోయిన సంవత్సరం సరిగ్గా ఇదే రోజున అంటే 09.12.2024 న ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడి హోదాలో పార్టీ అధికారిక లెటర్ హెడ్ పై ఈ ప్రకటన చేశారు. అప్పటికి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో ఒకటి టీడీపీ, ఒకటి జనసేన, మరొకటి బీజేపీ తీసుకుంటాయని ప్రచారం జరిగింది. వాటిలో టీడీపీ నుండి బీద మస్తాన్ రావు, బీజేపీ నుండి కృష్ణయ్య, జనసేన నుండి కొణిదెల నాగబాబు అని అందరూ ఫిక్స్ అయ్యారు. అనూహ్యంగా టీడీపీ నుండి మరోపేరు సాన సతీష్ పేరు సీన్ లోకి రావడం తో టీడీపీ రెండు ఎంపీ స్థానాలు తీసుకొంది. సాన సతీష్ రాజ్యసభ సీటు వెనుకాల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ ఆశీస్సులు ఉన్నాయన్న ప్రచారం గుప్పుమంది. జగన్ హయాంలో చంద్రబాబు జైలు కి వెళ్ళినప్పుడు ఢిల్లీ వ్యవహారాల్లో లోకేష్ కి అండగా సాన సతీష్ ఉన్నారని అందుకే ఆయనకీ ఆ పదవి దక్కింది అని టీడీపీ లో చాలామంది గుసగుసలాడారు. ఇక నాగబాబు కి రాజ్యసభ సీటు ఖాళీ లేకపోవడం తో ఆయనను మంత్రిమండలి లోనికి తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా లిఖిత పూర్వకం గా ప్రకటించారు. అయితే అది ఇప్పటికీ ఆచరణ లోనికి మాత్రం రాలేదు2019-24 మధ్యలో జనసేన లో నాగబాబు కీలక పాత్ర పోషించారు. 2019 ఎన్నికల్లో నరసాపురం నుండి ఎంపీ గా పోటీ చేసి అప్పటి వైసీపీ ఎంపీ అభ్యర్థి రఘు రామ కృష్ణం రాజు చేతిలో ఓడిపోయారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా 2024 వరకూ పార్టీ తరపున కీలకం గా ఉంటూ వచ్చారు. 2024, ఎన్నికల్లో నరసాపురం నుండి పోటీ చేద్దాం అనుకుంటే అది కూటమి కోసం త్యాగం చెయ్యాల్సి వచ్చింది. అనకాపల్లి నుండి పోటీ అనుకున్నా చివరి క్షణం లో అది బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ కోసం వదిలిపె ట్టాల్సి వచ్చింది. మధ్యలో ఎమ్మెల్యే గా పోటీ చేద్దాం అనుకున్నా అదికూడా కుదరలేదు. దానితో రాజ్యసభ కు పంపుదామని పవన్ భావించారు. కానీ అదికూడా సాన సతీష్ కోసం వదలాల్సిన పరిస్థితు లు ఏర్పడ్డాయి. వరుసగా నాగబాబుకి హ్యాండ్ ఇస్తూ ఉండడం పై అభిమానుల్లో ఏర్పడ్డ అసంతృప్తి ని చల్లార్చడానికి ఎన్నడూ లేని విధంగా రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన లో భాగం గానే నాగబాబు కి మంత్రి పదవి అంటూ చంద్రబాబు నాయడు స్పష్టత ఇచ్చారు. కానీ ఏడాది దాటినా అది ప్రకటన లానే ఉండిపోయింది. అయితే ఆయన్ను ఎమ్మెల్సీ ని చేసి శాసన మండలి కి పంపారు. ఏపీ క్యాబినెట్ లో ప్రస్తుతం ఒక్క ఖాళీనే ఉంది. దానిని నాగబాబు తో భర్తీ చెయ్యాలని చంద్రబాబు అనుకున్నా చివరి నిముషం లో జన సేనాని పవన్ కళ్యాణ్ పునరాలోచన లో పడ్డారని జనసేన వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే జనసేన నుండి పవన్ కళ్యాణ్, కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ మంత్రులు గా ఉన్నారు. వీరిలో పవన్, దుర్గేష్ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు. ఇప్పుడు నాగబాబు కి మంత్రి పదవి అంటే ఉన్న నాలుగు మంత్రి పదవుల్లో మూడు ఒకే సామాజిక వర్గానికి ఇచ్చినట్టు అవుతుంది. దానివల్ల జనసేన కు పూర్తిగా కులముద్ర పడిపోయే అవకాశం ఉంటుందని ప్రత్యర్థులకు ఆ అవకాశం ఇవ్వడం ఎందుకు అనేది పవన్ కళ్యాణ్ ఆలోచన గా చెబుతుంటారు ఎనలిస్ట్ లు. ఒకానొక సందర్భంలో పవన్ కూడా ఇండైరెక్ట్ గా ఇదే మాట చెప్పే ప్రయత్నం కూడా చేశారు. దానితో నాగబాబుకు మంత్రి పదవి అనేది రియాలిటీ కి దూరంగా ఉండిపోయింది. మరి త్వరలో జరుగబోతోందిఅని ప్రచారం లో ఉన్న మంత్రి మండలి పునర్వవస్థీకరణ లో అన్నా నాగబాబు కి మంత్రి పదవి లభిస్తుందా లేదా అన్నది ఏపీ పాలిటిక్స్ లో ఆసక్తి కర చర్చ లా మారింది.

# కేటీఆర్ పుత్రోత్సాహం.. హిమాన్ష్ ఫస్ట్ ఎక్స్పీరియన్స్ వైరల్

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** కేటీఆర్.. తెలంగాణ ప్రజలకు పరిచయం అక్కరలేని పేరు. పదేళ్ల కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా, ఆయన కొడుకు గా.. కేటీఆర్ తెలంగాణకు ముఖ్యమైన మంత్రిగా పనిచేవారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. దీంతో ప్రస్తు తం పార్టీ వర్కింగ్ ప్రెడిసెంట్‌గా బాధ్యతలు చూసుకుంటున్నా రు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పాత్ర పోషిస్తున్నారు. కేటీఆర్ వార సుడు.. కేసీఆర్ మనుమడు.. కల్వకుంట్ల హిమాన్ష్ కూడా 2023 ఎన్నికల సమయంలో పార్టీ తరఫున ప్రచారం చేశారు. అయితే చాలా మందికి ఆయన కేసీఆర్ ద్వారానే పరిచయం అయ్యాను. ముఖ్యమంత్రిగా ఏ కార్యం తలపెట్టినా మనుమడిని వెంట తీసుకెళ్లే వారు. భద్రాద్రి సీతారాముల కళ్యానానికి మనుమడితో తలంబ్రాలు పంపించారు. ఇది అప్పట్లో వివాదాస్పదమైంది. ఇదంతా ఎందు కంటే..ఆహిమాన్స్ ఇప్పుడు అమెరికాలో చదువుకుంటున్నాడు. రాష్ట్ర ంలో చదువుకుంటున్న మయంలోనే ప్రతిభ చాటుకున్నాడు. ఇప్పుడు అమెరికాలో.. సొంతంగా ఉద్యోగం సాధించాడు. అమెరికాకు స్టూడెంట్‌గా వెళ్లిన హిమాన్షు ఇప్పుడు.. అక్కడే ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాడు. తరగతి గదిలో విద్యార్థిగా ఉన్నప్పటి నుండి ఉపాధ్యాయుడిగా మారిన దశ ఆశ్చర్యకరమైనది, ఇది వ్యక్తిగతంగా ప్రత్యేక అనుభూతిని కలిగిందని హిమాన్షు ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇక తన తొలి ఉద్యోగం వీడియో వైరల్ అవుతోంది. హిమాన్షు పోస్టుపై నెటిజన్లు స్పందిస్తున్నారు. తండ్రికిదగ్గ తనయుడు అని పోస్టులు పెడతున్నారు. గతంలో కేటీఆర్ కూడా అమెరికాల జాబ్ చేశాడని, తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడని, హిమాన్షు కూడా అమెరికాలో జాబ్ కొట్టాడని.. భవిష యత్‌లో తెలంగాణ రాజకీయాల్లో రాణిస్తాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక చాలా మంది హిమాన్షుకు ఆల్ దిబెస్ట్ చెబుతూ పోస్టులు పెట్టారు. అమెరికాలో ఉన్నత విద్య పూర్తిచేసి, ఉద్యోగంలో అడుగుపెట్టడం హిమాన్షు కృషి, నేర్చుకునే ధోరణిని ప్రతిబింబిస్తోంది. ఈ మార్పు యువతకు ప్రేరణగా నిలవచ్చని భావిస్తున్నారు.

# రూ 315 కోట్లకు తాజ్ బంజారా సోల్డ్!




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో కీలక ఒప్పందం జరిగింది. ప్రఖ్యాత తాజ్ బంజారా హోటల్‌ను అరబిందో గ్రూప్‌కు చెందిన ఆరో రియాల్టీ రూ. 315 కోట్లకు కొనుగోలు చేసింది. 16,645 చదరపు యార్డ్స్‌లో విస్తరించి ఉన్న ఈ లగ్జరీ ప్రాపర్టీలో.. 1.22 లక్షల చదరపు అడుగుల బిల్ట్-అప్ ఏరియా ఉంది. ఈ లగ్జరీ హోటల్‌లో 270 గదులతో ఉన్నాయి. కాగా, ఈ ఏడాది ప్రారంభం నుంచి బంజారా హిల్స్‌లో రియల్ ఎస్టేట్ ధరలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఒప్పందం ప్రాధాన్యత సంతరించుకుంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో కీలక ఒప్పందం జరిగింది. నగరంలో ప్రఖ్యాత లగ్జరీ హోటళ్లలో ఒకటైన 'తాజ్ బంజారా'ను అమ్మేశారు. అరోబిందో గ్రూప్‌కు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ.. ఆరో రియాల్టీ ఈ హోటల్ ప్రాపర్టీని రూ. 315 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ ఏడాది అక్టోబర్ 31న దీనికి సంబం ధించిన లావాదేవీలు పూర్తైనట్లు సమాచారం. నగరంలో జరిగిన ముఖ్యమైన ఒప్పందాల్లో ఒకటిగా ఈ తాజ్ బంజారా డీల్ నిలిచిందని రియల్ ఎస్టేట్ నిపుణులు పేర్కొంటున్నారు. తాజ్ బంజారా కొనుగోలుకు స్టాంప్ డ్యూటీ కింద రూ. 17.3 కోట్లు చెల్లించినట్లు తెలుస్తోంది. కాగా, హోటల్ బంజారా లిమిటెడ్ సంస్థకు చెందిన ఈ తాజ్ బంజారా.. 16,645 చదరపు యార్డ్స్ విస్తీర్ణం కలిగిన ల్యాండ్ పార్సల్‌లో ఉంది. ఇందులో బిల్ట్-అప్ ఏరియా 1.22 లక్ష చదరపు అడుగులు. ఈ హోటల్‌లో మొత్తం 270పైగా గదులు ఉన్నాయి. అయితే, గత రెండు సంవత్సరాలుగా పన్నులు చెల్లించకపోవడంతో.. ఈ ఏడాది ప్రారంభంలో జీహెచ్ఎంసీ అధికారులు తాజ్ బంజారాను లాక్ చేసినట్లు తెలుస్తోంది. అయితే కొంత మొత్తంలో పన్నులు చెల్లించడంతో తిరిగి ప్రారంభమైనట్లు సమాచారం. మరోవైపు, కొత్తగా కొనుగోలు చేసిన ప్రాపర్టీని ఆరో రియాల్టీ ఎలా ఉపయోగించుకోనుంది అనే విషయంపై ఆ కంపెనీ వివరాలు వెల్లడించలేదు. కాగా బంజారా హిల్స్.. హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో ఒకటిగా ఉంది. ఇక్కడ విలాసవంతమైన నివాస ప్రాంతాలు, లగ్జరీ హోటళ్ళు, కార్పొరేట్ కార్యాలయాలు, ప్రీమియం రిటైల్ కార్యకలాపాలకు ప్రసిద్ధి చెందింది. చాలా మంది ప్రముఖులు ఈ ప్రాంతంలోనే నివసిస్తారు. 2025 ప్రారంభం నుంచి బంజారాహిల్స్‌లో రియల్ ఎస్టేట్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. కుష్మాన్ అండ్ వేక్‌ఫీల్డ్ డేటా ప్రకారం.. బంజారా హిల్స్‌లో ధరలు ఈ ఏడాది సుమారు 8 శాతం పెరిగాయి. సగటున చదరపు అడుగుకు రూ. 12,000 రూ. 15,000 పెరిగాయట. ఇంతకుముందు కూడా తాజ్ బంజారా లాంటి కీలక ఒప్పందాలు జరిగాయి. డిసెంబర్ 2న వీవర్క్ ఇండియా అనే కంపెనీ.. హైదరాబాద్ హైటెక్ సిటీలో ఉన్న స్కైవ్యూ 20 టెక్ పార్క్‌లో.. 1.75 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని ఐదు సంవత్సరాల కాలానికి లీజుకు తీసుకుంది. అందుకోసం రూ. 1.72 కోట్ల ప్రారంభ నెలవారీ అద్దె చెల్లించనుంది. అయితే ఇందులో రెండు అంతస్తుల స్థలాన్ని జేపీ మోర్గాన్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 60 నెలల పాటు.. రూ. 4.38 కోట్ల ప్రారంభ నెలవారీ అద్దెకు సబ్-లీజుకు ఇవ్వడం గమనార్హం.

# సిటీలో 1500 కి.మీ. మేర 'పీపుల్ ఫస్ట్ కారిడార్లు'

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా మార్చేం దుకు తెలంగాణ ప్రభుత్వం 'విజన్-2047'తో దూసుకుపోతోంది. మెరుగైన రవాణా, పారిశ్రామిక అభివృద్ధి, వారసత్వ సంపద పరిరక్షణ, పౌర సౌకర్యాలు, పచ్చదనం పెంపు వంటి అంశాలపై దృష్టి సారించారు. మూసీ నదిని సుందరీకరించి 24 గంటల తాగునీటి సరఫరా లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. హైదరాబాద్‌ను ఆవిష్కరణలకు, పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047 పేరుతో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలపడానికి బృహత్తర ప్రణాళికను రూపొందించింది. దేశంలోనే కాదు, ప్రపంచంలోని పది అగ్రగామి ఆవిష్కరణలకు, పెట్టుబడులకు, అత్యుత్తమ జీవన ప్రమాణాలకు కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్నది విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యం. కోర్ అర్బన్ రీజియన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రణాళికలను ప్రభుత్వం నిర్దేశించింది. ఈ విజన్ ప్రధానంగా మొబిలిటీ, పారిశ్రామిక అభివృద్ధి, వారసత్వ సంపద, పౌర సౌకర్యాలు, పర్యావరణ పరిరక్షణ అనే ఐదు కీలక స్తంభాలపై ఆధారపడి ఉంది. నగర భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌లో సమీకృత రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. మెట్రో, ఎంఎంటీఎస్, ఆర్టీసీ సర్వీసులను అనుసంధానించడం ద్వారా ప్రజలకు మెరుగైన ప్రయాణ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం కామన్ మొబిలిటీ కార్డును అందుబాటులోకి తీసుకురానున్నారు. అంతేకాక, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ప్రత్యేక మార్గాల్లో బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్) ను ఏర్పాటు చేయనున్నారు. ప్రజారవాణాను ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించడం ద్వారా శివారు ప్రాంతాల ప్రజలకు సౌలభ్యం కల్పించనున్నారు. ముఖ్యంగా, రవాణా ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజారవాణా మార్గాల నుంచి కేవలం 15 నిమిషాల్లో చేరుకునే దూరంలో నిర్మించే కార్యాలయాలు, వాణిజ్య భవనాలు, నివాసాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది. నగరంలో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి 1,000 కి.మీ. వాకింగ్, సైక్లింగ్ కారిడార్లు, పాదచారుల కోసం అంతరాయాలు లేని పాదబాటలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, స్కైవాక్‌లను నిర్మించనున్నారు. నగరవ్యాప్తంగా 1500 కి.మీ. మేర 'పీపుల్ ఫస్ట్ కారిడార్ల'ను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ రద్దీ లేని, సురక్షితమైన వీధులను డిజైన్ చేయనున్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న పారిశ్రామిక భూములను బహుళ వినియోగానికి అనువుగా అభివృద్ధి చేయడానికి బ్లూన్‌ఫీల్డ్ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించనున్నారు. పర్యాటక రంగ అభివృద్ధి లక్ష్యంగా వారసత్వ సంపద సంరక్షణకు చర్యలు తీసుకుంటారు. పాతబస్తీకి యునెస్కో వరల్డ్ హెరిటేజ్ హోదా సాధించడాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. 100 పార్కులను, ప్లాజాలను సాంస్కృతిక కేంద్రాలుగా తీర్చిదిద్ది, భారీ ఈవెంట్లకు వేదికలుగా మారుస్తారు. నైట్ ఎకానమీని పెంచడానికి సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్స్, జలాశయాల వద్ద, ఐటీ కారిడార్లలో 24 గంటలు పనిచేసేలా హ్యాకర్స్ సెంటర్స్ 2.0 మరియు ఆధునిక మార్కెట్లను ఏర్పాటు చేయనున్నారు. పర్యావరణ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని బ్లూ-గ్రీన్ హైదరాబాద్- 2047 పేరుతో ప్రత్యేక ప్రణాళికను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా మూసీ నదిని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతూ మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేపడతారు. పశ్చిమం నుంచి తూర్పు వరకు 35-40 కి.మీ. పొడవునా నడక మార్గాలు, వాటర్ ట్యాక్సీ డాక్స్, జెట్టీలు, వంతెనలు, వ్యూయింగ్ డెక్‌లతో సుందరీకరణ చేపట్టనున్నారు. 100 చెరువులను సుందరీకరించడంతో పాటు హుస్సేన్‌సాగర్ 2.0 ద్వారా దానిని మరింత అభివృద్ధి చేస్తారు. జలాశయాల వద్ద సైక్లింగ్, వాకింగ్ లూప్స్, మురుగునీటి శుద్ధి కేంద్రాలు, రెయిన్ గార్డెన్స్ ఏర్పాటు చేస్తారు. 1500 కి.మీ. అర్బన్ ఫారెస్ట్ బ్లాక్స్, స్ట్రీట్ కనోపీ, నడక మార్గాలు ఏర్పాటు చేయడం ద్వారా నగరంలో పచ్చదనాన్ని పెంచుతారు. ఈ విజన్‌లో అత్యంత ముఖ్యమైన అంశం ఏంటంటే, ప్రజలకు 24 గంటలూ తాగునీరు సరఫరా చేసే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుంది.

# ఎక్సైజ్ సిఐ వేధింపులు.. వైన్ షాప్ మూసివేసిన అధ్యక్షుడు

బేతంచెర్ల : బేతంచెర్ల పట్టణంలో టిడిపి నాయకుడు సింగిల్ విండో అధ్యక్షుడు ఉన్నం చంద్రశేఖర్ సైతం ఎక్సైజ్ అధికారుల తీరుతో చేదు అనుభవం ఎదురయింది టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేట్ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది మొదటినుంచి ఎక్సేజ్ అధికారులు మామూల కోసం వేట ప్రారంభించడంతో అడిగినంత ఇస్తూ వచ్చాం అదనంగా తెచ్చి ఇవ్వాలని లేకపోతే కేసులు పెడతామని ఎక్సైజ్ అధికారులు బెదిరించడంతో మీరు అడిగినంత ఇవ్వలేనని గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి కాకతీయ వైన్ షాప్ ని బంద్ చేసి ఈ సందర్భంగా కాకతీయ వైన్ షాప్ యజమాని సింగిల్ విండో అధ్యక్షుడు ఉన్నం చంద్రశేఖర్,ఆయన వేదనను విలేకరులు ఎదుట వ్యక్తం చేశారు. నేను కూడా లాటరీ విధానంలో5 దుకాణాలకు దరఖాస్తు చేసుకోగా అయితే నాకు మద్యం దుకాణాలు దక్కలేదు అయితే నేను వేరే వ్యక్తుల నుండి 58 లక్షలకు మద్యం దుకాణం ను కొనుగోలు చేశాను డోన్ ఎక్సైజ్ సిఐ వరలక్ష్మికి విడతల వారీగా 15 లక్షల దాకా ఇచ్చానన్నారు. మరల ఆగస్టు నెలలో బారుకు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ వరలక్ష్మి, మరో అధికారి రాముడు,బెదిరింపులకు గురి చేయడంతో దరఖాస్తు చేశాను అన్నారు. వారి వల్ల ఇప్పటివరకు నాకు 20 లక్షల దాకా నష్టపోయానని అన్నారు. నేను వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను అలాగే పాల వ్యాపారం చేస్తూ స్వీటీ వ్యాపారం చేస్తూ అభివృద్ధి చెందాను ఎక్సైజ్ అధికారులకు లంచాలు ఇవ్వలేక మద్యం దుకాణాన్ని బందు చేసినట్లు ఆయన ఆపోయాడు

# కనీస గౌరవమేదీ?



ముప్పరు ఏళ్లకు పైగా ప్రభుత్వ, ప్రైవేటురంగ సంస్థల్లో సేవలందించి, ఉద్యోగ విరమణ అనంతరం కేవలం పింఛను మీదనే ఆధారపడి జీవించే వారి పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అమానుషంగా ఉంది. వయసు పెరిగి, ఆరోగ్య భద్రత అవసరాలు పెరిగిన తరుణంలో పాలకులు కనీస ఆసరా అందించని దుస్థితి శోచనీయం. ఏ దేశంలోనైనా సీనియర్ సిటిజన్లు ఎంత ఆరోగ్యంగా, ఎంత ఆనందంగా జీవిస్తే- ఆ దేశం అంత ఉన్నత సమాజంగా రూపుదిద్దుకున్నట్టు భావించవొచ్చు. మన దేశంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో పనిచేసి, రిటైరైన వారు పొందుతున్న కనీస పింఛను వెయ్యి రూపాయలు. ఇంత తక్కువ మొత్తంతో ఏ ఒక్కరైనా నెల రోజుల కనీస అవసరాలు తీర్చుకోగలరా ఆరోగ్య సంరక్షణ చేసుకోగలరా ఈ కనీస మొత్తాన్ని కాస్త పెంచమని ఏళ్ల తరబడి పింఛనుదారులు మొర పెట్టుకుంటున్నా- మోడీ సర్కారు కనికరించటం లేదు. ఈ అభ్యర్థన తమ పరిశీలనలో ఉందని నిన్నమొన్నటి దాకా సానుకూల సంకేతాలు ఇచ్చిన ప్రభుత్వం %-% అలాంటి ఆలోచనే లేదని తాజాగా తేల్చి చెప్పేయటం తీవ్రమైన బాధ్యతారాహిత్యం. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌కి తగినంత ఆదాయం లేదని, అందువల్ల పెంపు సాధ్యం కాదని కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ప్రకటించటం లక్షలాది మంది పింఛనుదారులకు తీవ్ర ఆశాభంగం కలిగించింది. హక్కులను హరించి, కార్పొరేట్లకు దాస్యం చేయించటమే పనిగా పెట్టుకున్న బిజెపి సర్కారు ఇది శ్రమజీవులకు చేసిన మరొక నమ్మక ద్రోహం. ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తేనే సంస్థలు నడుస్తాయి. అభివృద్ధి దారులు పరుచుకుంటాయి. అలా పనిచేసే శ్రమజీవుల మూల వేతనం నుంచి కొంత, యాజమాన్యం వాటా నుంచి కొంత వేరు పరచి, ఉద్యోగుల భవిష్య నిధిలో భద్రపరచటం 1952 నుంచీ అమలులో ఉంది. ఉద్యోగులు అలా దాచిన సొమ్ములో కొంత ఉద్యోగ విరమణ తరువాత ప్రావిడెంటు ఫండ్‌గా పొందుతారు. పెన్షన్ స్కీములో జమ అయిన సొమ్ము నుంచి నెలనెలా పింఛను అందుకుంటారు. నెలనెలా కనీసం ఇద్దరి జీవనానికి భరోసాగా ఉపయోగపడాల్సిన ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రహసనంగా మార్చేసింది. పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా కనీస పింఛను ఇవ్వాల్సింది పోయి, వెయ్యి రూపాయల తక్కువ మొత్తంతో పరిహాసం చేస్తోంది. పదకొండేళ్ల క్రితం నిర్ణయించిన పరిమితితోనే ఈ పథకాన్ని కొనసాగిస్తోంది. బిహెచ్‌పివి, పోర్టు, బిహెచ్ఇఎల్ వంటి ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ సంస్థల్లోనూ, వివిధ ప్రైవేటు సంస్థల్లోనూ పనిచేసిన వారందరికీ దాదాపుగా వెయ్యి నుంచి రెండున్నర వేలకు మించకుండానే పింఛను దక్కుతోంది. ప్రస్తుతం ఇపిఎఫ్ఒలో 20 కోట్ల మంది చందాదారులు ఉండగా, ఇపిఎస్‌లో 5.40 లక్షల మంది పింఛనుదారులు ఉన్నారు. ఇందులో 47 శాతం మంది వెయ్యి రూపాయల కనీస పింఛనుతోనే కన్నీళ్లు తుడుచుకోవాల్సి వస్తోంది. మొత్తంగా చూసినప్పుడు 85 శాతం మంది పింఛనుదారులకు నెలనెలా అందుతున్న ఆసరా రూ. 2500ల లోపే కావటం దయనీయ స్థితికి దాఖలా.

పింఛనుదారుల పరిస్థితి ఇంత అధ్వానంగా ఉండగా, కొంచెం కొంచెం విదుల్చుతున్న ఇపిఎఫ్ఒ మాత్రం రూ.25 లక్షల కోట్ల ఖజానాగా వర్థిల్లుతోంది. ఆ మొత్తంలోని అత్యధిక భాగం ప్రభుత్వ రంగ సంస్థల అభ్యున్నతికి ఉపయోగపడుతోంది. పింఛనుదారుల జీవన ప్రమాణాల పట్ల పట్టింపు, కనికరం ప్రదర్శించటం కేంద్ర ప్రభుత్వ కనీస బాధ్యత. ఇప్పుడు చాలా రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సామాజిక పింఛను పథకమే రూ.3 వేల నుంచి రూ.15 వేలవరకూ ఉంది. అలాంటిది ఏళ్ల తరబడి తమ సొమ్ము జమ చేసుకున్న శ్రమజీవులకు అవసరాలకు తగ్గట్టుగా కనీస పింఛను ఇవ్వటం న్యాయబద్ధమైనది. వణికిస్తున్న చలిగాలుల మధ్య దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి ఢిల్లీ చేరి బుధవారం నాడు తమ గోడు వినిపించిన పింఛనుదారుల పట్ల కేంద్ర ప్రభుత్వం ఇకనైనా మానవత్వంతో వ్యవహరించాలి. వారు కోరుతున్నట్టుగా కనీస పింఛనును రూ.9 వేలకు పెంచాలి. ఉచిత వైద్య, ఆరోగ్య సేవలు అందించాలి. గతంలో వలె రైలు ప్రయాణంలో రాయితీని పునరుద్ధరించాలి. ఇపిఎస్ పెన్షన్‌దారులకు కూడా ఆయా రాష్ట్రాలు అందించే సామాజిక పింఛన్లను వర్తింపచేయాలి. దేశ ప్రగతికి దోహదపడిన నాటి పనిమంతులకు గౌరవప్రదమైన జీవనాన్నివ్వడం పాలకుల కనీస మర్యాదగా గుర్తెరగాలి.

# సినిమా..

## తుది దశ చిత్రీకరణలో పెద్ది



రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్ సమర్పిస్తున్నది. ఈ సినిమాకు సంబంధించి తాజా అప్‌డేట్ వెలువడింది. నేటి నుంచి హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభమవుతున్నది. ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక ఘట్టాలను తెరకెక్కించబోతున్నారు. జనవరి నెలాఖరు వరకు జరిగే ఈ షెడ్యూల్‌తో టాకీ పార్ట్ మొత్తం పూర్తవుతుందని మేకర్స్ తెలిపారు. ఓ వైపు షూటింగ్‌తో పాటు పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాల్ని కూడా సమాంతరంగా నిర్వహిస్తున్నామని చిత్రబృందం పేర్కొంది.

ఈ చిత్రంలో రామ్‌చరణ్ అన్ని ఆటల్లో ప్రావీణ్యం కలిగిన ఆటకూలీ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన ప్రచారచిత్రాలకు మంచి స్పందన లభించడంతో ఈ సినిమా కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. జాన్వీ కపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.

## 'లేచింది మహిళా లోకం' ఫస్ట్ లుక్

మంచు లక్ష్మీ ప్రసన్న, అనన్య నాగళ్ల, శ్రద్ధాదాస్, సుప్రీతా నాయుడు, హరితేజ, హేమ వంటి తారలు ప్రధాన పాత్రల్లో వస్తోన్న చిత్రం 'లేచింది మహిళా లోకం'. 2022లో ప్రారంభమైన ఈ సినిమా ఇప్పుడు రిలీజ్‌కు రెడీ అయింది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. కార్తీక్ అర్జున్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా, హైమా రాజశేఖర్, శ్వేత మహి, నిరోషా నవీన్ నిర్మించారు. త్వరలో థియేటర్లకు రానుంది.



# సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమం!



ప్రజలను రాజకీయంగా వశం చేసుకోవడం కోసం, ఆర్థిక దోపిడీ కొనసాగించడం కోసం, ప్రజల భాషా సంస్కృతుల మీద, అస్తిత్వం మీద,ఆత్మగౌరవం మీద వలసవాదులుదాడి చేస్తూనేఉంటారు. తద్వారా ప్రజలను ఆత్మన్యూనతాభావనలోకి నెట్టివేస్తారు.ఆతర్వాత రాజకీయ ఆధిపత్యం, సాంస్కృతిక అణచివేత, ఆర్థిక దోపిడీ, అన్ని రంగాల్లో వివక్షలు కొనసాగిస్తారు. ఇది చరిత్ర నిరూపించిన సత్యం. ఎందుకంటే ఒక వ్యక్తి అస్తిత్వం కానీ, ఆత్మగౌరవం కానీ, అవ్యక్తి నివసించే ప్రాంతం మీద, అతడు మాట్లాడే భాష మీద, ఆ వ్యక్తి ఆచరించే సంస్కృతీ సాంప్రదాయాల మీద ఆధారపడి ఉంటాయి కాబట్టి.

నాటి ఆంగ్లేయులు భారతదేశ సంస్కృతిని అవమానించినట్టే, నిన్నటి సీమాంధ్ర పాలకులు తెలంగాణ సంస్కృతిని కించపరిచారు. తెలంగాణ ఉద్యమానికి ప్రబలమైన సాంస్కృతిక కోణం ఉన్నది. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవం కనుమరుగు చేసేవిధంగా ఉమ్మడి రాష్ట్రంలో పరిపాలన కొనసాగింది. తెలంగాణ భాషను అడుగడుగునా అవమానపరిచారు. తెలంగాణ సాంస్కృతిక సందర్భాలను ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. తెలంగాణ సాహిత్యాన్ని అనాదరణకు గురిచేశారు. తెలంగాణ మహనీయులు, సాహితీవేత్తలు, ప్రముఖులను విస్మరణకు గురిచేశారు. తెలంగాణ చరిత్రను అవహేళన చేశారు. నిజాం పాలనలో తెలంగాణ ప్రజలు 'అయ్యా బాంచెన్ కాల్మొక్తా' అని బతికారని ప్రజల సామాజిక జీవనాన్ని అపహాస్యం చేశారు. తెలంగాణ ప్రతిభా సామర్థ్యాలను అణచివేతకు గురిచేశారు. ఈ విధంగా పలు కోణాల్లో జరిగిన సాంస్కృతిక దాడి తెలంగాణ ప్రజల హృదయాలను రగిలించింది. గుండెలను దహించివేసింది.

మానవజాతి చరిత్రలో జరిగిన పోరాటాలన్నింటికీ రెండే కారణాలు. ఒకటి అస్తిత్వ ఆకాంక్ష అయితే రెండవది, ఆత్మగౌరవ ఆకాంక్ష. అస్తిత్వ ఆకాంక్ష భారత స్వాతంత్ర్యోద్యమానికి దారితీస్తే, ఆత్మగౌరవ ఆకాంక్ష తెలంగాణ ఉద్యమానికి నాంది అయింది. సీత శోకం లంకా దహనానికి దారి తీసినట్టు, ద్రౌపది వస్త్రాపహరణమే కురుక్షేత్ర యుద్ధానికి నాంది అయినట్టు, తెలంగాణ ప్రజల యాస, భాషా, సంస్కృతుల అవమాన ఫలితమే తెలంగాణ ఉద్యమానికి కారణమైంది. ప్రజల ఆవేదన మాటలై, పాటలై, కవితలై, కథలై, వ్యాసాలై, నినాదాలై, నిరసనలై, ప్రతిఘటనయై, విగ్రహ విధ్వంసమై ఎగిసిపడింది.

సంస్కృతి అంటే ప్రజల జీవనసారం. కట్టూ బొట్టూ, మాటా పాటా, పండుగలు, జాతరలు, ఆచారాలు, సాంప్రదాయాలు, ఆహారపుటలవాట్లు, చరిత్ర, సాహిత్యం, అలంకరణ అన్నీ సాంస్కృతిక వ్యక్తీకరణలే! తెలంగాణది సుసంపన్నమైన సంస్కృతి. కృష్ణా గోదావరీ పావన నదీజలాలతో పునీతమైన ఈ గడ్డ మీద అతిప్రాచీన కాలం నుంచి సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, శిల్పం.. ఇలా అన్ని కళలూ అమోఘంగా వికసించాయి. భారతదేశంలో అతి సువిశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించిన కాకతీయులు తెలంగాణ కేంద్రంగానే పరిపాలన గావించారు. రామప్ప గుడిలోని రమణీయ శిల్పాలు నాటి తెలంగాణ కళా ప్రాభవానికి ప్రతీకలు. దక్కన్ పీఠభూమి అయిన తెలంగాణ, భౌగోళిక, చారిత్రక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మహోన్నత సంస్కృతినీ రూపుదిద్దుకున్నది. తొలి తెలుగు రాజులు శాతవాహనులు, సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించిన కాకతీయులు, చాళుక్యులు, మత సామరస్యాన్ని పెంపొందించి పరిపాలించిన కుతుబ్‌షాహీలు, హైదరాబాద్‌ను ఆధునిక నగరంగా తీర్చిదిద్దిన అసఫ్‌జాహీలు తెలంగాణ కేంద్రంగా పరిపాలన గావించారు.

స్వరాష్ట్రం కోసం, స్వాభిమానం కోసం, పోరాడి విజయం సాధించి, స్వపరిపాలనను స్థాపించుకున్న నేటి సందర్భంలో తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి బలమైన చర్యలు చేపట్టడం, ప్రతి ఒక్కరికీ అస్తిత్వ ఆత్మగౌరవ స్పృహ కలిగించడం ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం. లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి రాజకీయ వలసవాదం నుంచి విముక్తి పొందినప్పటికీ, సాంస్కృతిక వలసవాదం మరో రూపంలో ప్రజల మస్తిష్కంలోకి వారికి తెలియకుండానే పాదరసంలా ప్రసరించే ప్రమాదం పొంచి ఉన్నది. ప్రజాకవి కాళోజీ చెప్పినట్టు ప్రజలు ఆర్థికంగా దెబ్బతిన్నా కోలుకోవచ్చు, అధికారం కో ల్పోయినా తిరిగి సాధించుకోవచ్చు.

రాజాశ్రయాన్ని తిరస్కరించి భాగవతాన్ని రామాంకితం చేసిన బమ్మెర పోతన, జాను తెనుగులో కవిత్వం రచించిన పాల్కుర్కి సోమన, తొలి ద్విపద కావ్యం రచించిన గోన బుద్ధారెడ్డి, తొలి యక్షగానం రచించిన కందుకూరి రుద్రకవి, 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గర్జించిన దాశరథి, ప్రజల గొడవను తన గొడవగా కవిత్వం చెప్పిన కాళోజీ, తెలంగాణ సాహిత్య వైభవానికి చెరగని గురుతులు.

'జల్ జంగల్ జమీన్' నినాదంతో అడవి మీద హక్కుల కోసం ఆదివాసీల పక్షాన పోరాడిన కుమ్రం భీమ్, ఆదివాసీలలో ఆత్మగౌరవ చైతన్యం సాధించిన సమ్మక్క-సారక్కలు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నడిపించిన రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, భీంరెడ్డి నరసింహారెడ్డి, చాకలి ఐలమ్మలు ఈ నేల సాహసానికి, పోరాటానికి నిలువెత్తు నిదర్శనాలు. భారత ప్రధాని పీఠాన్ని అధిష్టించిన పీవీ నరసింహారావు తెలంగాణ రాజకీయ పటిమను చాటిచెప్పిన ఆధునిక చాణక్యుడు. తెలంగాణ ఉద్యమానికి తాత్విక భూమికను రూపొందించిన ప్రొఫెసర్ జయశంకర్ సదా అభినందనీయులు. తొలి తెలుగు రాజులు శాతవాహనుల రాజధాని కోటిలింగాల, బౌద్ధం విరాజిల్లిన ధూళికట్ట, నాగార్జున కొండలు, కాకతీయుల వేయి స్తంభాల గుడి, కుతుబ్ షాహీలు నిర్మించిన చార్మినార్, గోల్కొండలు తెలంగాణ మహోన్నత చరిత్రకు ఆనవాళ్లు.దేశ ప్రధాని అయిన తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు జన్మదినాన్ని కూడా జరుపని దౌర్భాగ్యం ఆంధ్ర వలసవాద పరిపాలనలో కొనసాగింది. కేసీఆర్ నేతృత్వంలో ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం పీవీ జయంతిని ఘనంగా నిర్వహించింది. అంతేకాకుండా హైదరాబాద్‌లోని వెటర్నరీ యూనివర్సిటీకి 'పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ'గా నామకరణం చేసి గౌరవించింది. మహాకవి దాశరథిని ఆస్థాన కవి పదవి నుంచి తప్పించి, నాటి ఆంధ్ర పాలకులు దారుణంగా అవమానించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తన కవిత్వంతో ప్రజలను ఉత్తేజపరిచిన దాశరథి జైలు గోడల మీద 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని రాసిన సాహసికుడు. అటువంటి మహాకవి ఔన్నత్యం ప్రపంచానికి చాటేవిధంగా ఆయన జయంతిని కేసీఆర్ ప్రభుత్వం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించింది. దాశరథి పేరిట ఫౌండేషన్‌ను ఏర్పాటుచేసి లక్ష వెయ్యి నూట పదహార్ల దాశరథి పేరిట అవార్డులు ప్రదానం చేసింది. కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినంగా ప్రకటించి, ఏటా అధికారికంగా ఉత్సవాలు నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో కాళోజీ సాహిత్య అవార్డును ఏర్పాటుచేసి ఏటా ఒక సాహితీవేత్తకు బహూకరించారు. హన్మకొండలో కాళోజీ పేర కళాక్షేత్రం నిర్మించారు. వరంగల్‌లో ఉన్న తెలంగాణ హెల్త్ యూనివర్సిటీకి 'కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్'గా నామకరణం చేశారు. తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీకి శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీగా పేరు మార్చారు. తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీకి 'ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీ'గా నామకరణం చేశారు.

తెలంగాణకు తలమానికం బతుకమ్మ పండుగ. ఈ పండుగ సందర్భంగా పేర్చే బతుకమ్మను దేవతగా భావించడం తెలంగాణ సంస్కృతిలోని ప్రత్యేకత. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు ఈ పండుగను కనీసం గుర్తించడానికి కూడా నిరాకరించాయి. ఇటువంటి బతుకమ్మను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించి, ట్యాంక్‌బండ్‌పై ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. బోనాల పండుగ తెలంగాణకే ప్రత్యేకమైనది. గోల్కొండ రాజుల కాలం నుంచి బోనాల పండుగకు విశేష ప్రాధాన్యం ఉన్నది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215